ప్రజల మనోభావాలను దెబ్బతీస్తే ఊరుకునేది లేదు


సమావేశంలో మాట్లాడుతున్న కోరుకంటి చందర్

గోదావరిఖని, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో గుళ్లకూల్చి ప్రజల మనోభావాలను దెబ్బ తీసిన వారు తగిన మూల్యం చెల్లించక తప్పదని రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ హెచ్చరించారు. బుధవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ అర్ధరాత్రి రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో ఉన్న 46దారిమైసమ్మ, ఎల్లమ్మ గుడులను కూల్చివేశారని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నట్టు చెప్పారు. కూల్చివేతకు గురైన గుళ్లను వెంటనే నిర్మించాలని, లేకపోతే ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం, మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు గోపు ఐలయ్య, బొడ్డురవీందర్, మెతుకుదేవరాజ్, పాల్గొన్నారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

పెద్దపల్లి కల్చరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పారామెడికల్ కోర్సుల ప్రవేశానికి ఈనెల 27వరకు దరఖాస్తు గడువు పొడిగించినట్లు రామగుండం ప్రభుత్వ మెడికల్ వైద్యకళాశాల ప్రిన్సిపాల్ నరేందర్ తెలిపారు. ప్రభుత్వమెడికల్ కళాశాలకు అనుబంధంగా నడుస్తున్న 28అలైడ్ హెల్త్‌సైన్స్ కళాశాలలో పారామెడికల్ డిప్లమో కోర్సుకు ప్రస్తుత విద్యాసంవత్సరానికి నోటిఫికేషన్ జారీచేసిన నేపథ్యంలో డీఎంఎల్‌టీలో 30 సీట్లు, డయాలసిస్‌లో 30సీట్లు ఉన్నాయని తెలిపారు. ఇందులో ఇంటర్‌లో బైపీసీ విద్యార్థులు అర్హులని, ఒకవేళ బైపీసీ వారు లేని యెడల ఎంపీసీ వారికి అవకాశం ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాల కోసం పారామెడికల్ బోర్డు వెబ్‌సైట్‌ను సందర్శించాలని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పెద్దపల్లి కల్చరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): గత విద్యాసంవత్సరంతో పాటు ప్రస్తుత విద్యాసంవత్సరానికి ప్రిమెట్రిక్ ఉపకారవేతనాల కోసం దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి రంగారెడ్డి తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 9,10వ తరగతి బీసీవిద్యార్థులు వారి అర్హతల మేరకు ఆన్‌లైన్‌లో ఉపకారవేతనాల వెబ్‌సైట్‌లో ఫ్రెష్, రెన్యువల్ వారు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఈ విషయంలో విద్యార్థులకు సహకరించాలని తెలిపారు.

మంత్రి, ఎమ్మెల్యే పరామర్శ

పెద్దపల్లిటౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ఈర్ల స్వరూపసురేందర్‌ల కుమారుడు విశ్వతేజ్ బుధవారం రోజున మరణించగా రాష్ట్రమంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తోకలిసి ఎమ్మెల్యే విజయరమణారావు విశ్వతేజ్ పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈర్ల స్వరూప సురేందర్‌ను పరామర్శించి ప్రగాఢసంతాపాన్ని తెలిపారు. అనంతరం అంతిమయాత్రలో పాల్గొన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ చైర్మన్లు, డైరెక్టర్లు, సింగిల్ విండో చైర్మన్లు, డైరెక్టర్లు, మాజీ ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మరియు తదితరులు పాల్గొన్నారు.

'చేయూత' ఏదీ?

- కొత్త పింఛన్ల కోసం నిరీక్షణ
- పింఛన్ల పెంపుపై అడుగంటుతున్న ఆశలు
- జిల్లాలో 56,531దరఖాస్తులు
- రెండేళ్లు కావస్తున్నా పింఛన్ల ఊసెత్తని ప్రభుత్వం



(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే రెండేళ్లు దగ్గర పడుతున్నా కూడా చేయూత పథకం కింద కొత్త పింఛన్‌లను మంజూరు చేయకపోవడమే కాకుండా, ఉన్నపింఛన్‌ల సొమ్మును పెంచి ఇస్తామన్న హామీ ఇప్పటివరకు నెరవేరలేదు. దీంతో పింఛన్లు పెంచుతారని ఆశతో పింఛన్‌దారులు ఎదురు చూస్తుండగా, కొత్త పింఛన్లు ఎప్పుడు మంజూరు చేస్తారా అని కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. జిల్లాలో మొత్తం 96,641మందికి ప్రస్తుతం పింఛన్‌లు అందుతున్నాయి. ఇందులో వృద్ధాప్య పింఛన్లు 41,055మంది, వితంతు పింఛన్లు 32,955మంది, దివ్యాంగుల పింఛన్లు 13,123మంది, గీత కార్మికులు 2200, చేనేత కార్మికులు 807మంది, బీడీ కార్మికులు 700మంది, ఒంటరి మహిళలు 2215 మంది, బోదకాలు బాధితులు 341మంది, ఇతరులు 1,246మందికి నెలనెలా పింఛన్లు అందుతున్నాయి. దివ్యాంగులకు నెలకు 3,016 రూపాయలు, ఇతరులకు 2,016రూపాయల పింఛన్లు ఇస్తున్నారు. 2023నవంబర్ చివరలో జరిగిన రాష్ట్ర ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్‌పార్టీ తాము అధికారంలోకి వస్తే ఆరు గ్యారెంటీ పథకాలతోపాటు ఇతర పథకాలను అమలు చేస్తామని హామీ ఇచ్చారు. అందులో

(మిగతా 8వ పేజీలో)

అంతర్జాతీయ వయోవృద్ధుల వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్ దాసరి వేణు

పెద్దపల్లి కల్చరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ వయోవృద్ధుల వారోత్సవాల పోస్టర్‌ను జిల్లా అదనపుకలెక్టర్ దాసరివేణు బుధవారం ఆవిష్కరించారు. జిల్లా కలెక్టరేట్‌లోని ఆయన కార్యాలయంలో పలువురు వృద్ధులతోకలిసి వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి కవిత, సూపరింటెండెంట్ కొట్టె రాజయ్య, ఫీల్డ్ రెస్పాన్స్ ఆఫీసర్ బాల స్వర్ణలత, సీనియర్ సిటిజన్స్ కమిటీ మెంబర్ స్వామి, జీవన్ రాజు, నూనెరాజేశం, గంట సత్తయ్య, సుందరి పాల్గొన్నారు.

ధాన్యాన్ని త్వరగా కొనుగోలు చేయాలి: కలెక్టర్


చిన్నబొంకూర్‌లో కొనుగోలు సెంటర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

సుల్తానాబాద్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ధాన్యాన్ని త్వరగా కొనుగోలు చేసి, మిల్లులకు తరలించాలని కలెక్టర్ కోయశ్రీహర్ష అన్నారు. బుధవారం ఆయన మండలంలోని చిన్నబొంకూరులో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో నాణ్యత ప్రమాణాలను పరీక్షించి, ధాన్యాన్ని వెంటనే రైస్‌మిల్లులకు తరలించాలని అధికారులను ఆదేశించారు. ధాన్యం కొన్నవివరాలు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, రైతులకు 48గంటల్లోగా డబ్బులు చెల్లించాలని ఆదేశించారు. హమాలీల సమస్యలు రాకుండా శ్రద్ధ పెట్టాలన్నారు. కలెక్టర్ వెంట జిల్లా పౌరసరఫరాల అధికారి శ్రీనాథ్, అధికారులు ఉన్నారు.

17శాతం లోపు తేమ ఉన్న ధాన్యమే తీసుకురావాలి..

పెద్దపల్లిటౌన్: రైతులు ధాన్యాన్ని ఆరబెట్టుకొని 17 శాతం లోపు తేమ వచ్చిన తర్వాతే కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష బుధవారం ఒక ప్రకటనలో సూచించారు. పొలం నుంచి నేరుగా కొనుగోలు కేంద్రాలకు తీసుకొని రావద్దని కలెక్టర్ కోరారు. తేమ ఎక్కువగా ఉన్న వడ్లను తీసుకువచ్చి రైతులు కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బంది పడవద్దని సూచించారు. సరైన తేమ శాతం ఉన్న ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు కేంద్రాలకు తీసుకొని రావాలని కలెక్టర్ కోరారు.

హాస్టల్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి..

మంథని : గురుకుల ఆశ్రమ పాఠశాల పరిసరాలను ఎప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. స్థానిక సాంఘికసంక్షేమ గురుకుల ఆశ్రమ పాఠశాలను ఆయన బుధవారం తనిఖీచేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. హాస్టల్‌లో విద్యార్థులకు రుచికరమైన వంటలు చేయించాలన్నారు. ప్రాంగణంలోని పిచ్చిమొక్కలను వెంటనే తొలగించాలని ఆదేశించారు. రాబోయే 10వ తరగతి పరీక్షల్లో ప్రతివిద్యార్థి ఉత్తీర్ణత సాధించే విధంగా కృషిచేయాలన్నారు. వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ప్రతిరోజు స్టడీ అవర్స్ నిర్వహించాలని, ముఖ్యమైన పాఠ్యాంశాలను రివిజన్ చేయించాలన్నారు. ఆయన వెంట అధికారులు ఉన్నారు.

రేషన్‌డీలర్ల కమీషన్ చెల్లించండి

మార్కండేయకాలనీ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సన్నబియ్యం పథకాన్ని విజయవంతం చేయడంలో రేషన్ డీలర్లు ప్రధానపాత్ర వహిస్తున్నారని, కానీ వారిని ప్రభుత్వం శీతకన్నుతో చూడడం భావ్యం కాదని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు గౌతం గోవర్ధన్ ఒక ప్రకటనలో అన్నారు. ఏడునెలలుగా పెండింగ్‌లో ఉన్న కమీషన్ డబ్బులను వెంటనే డీలర్లకు చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

నేడు వ్యవసాయ మార్కెట్ బంద్

పెద్దపల్లిటౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): నేడు వ్యవసాయ మార్కెట్ బంద్ చేస్తున్నట్లు మార్కెట్ కార్యదర్శి ప్రవీణ్‌రెడ్డి బుధవారం ఒకప్రకటనలో తెలిపారు. మార్కెట్‌చైర్మెన్ ఈర్లస్వరూప కుమారుడు విశ్వతేజ్ మృతిచెందడంతో ఈనిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. గురువారం పత్తి క్రయ విక్రయాలు నిలిపివేస్తున్నట్లు తెలిపారు. తిరిగి శుక్రవారం యథావిధిగా మార్కెట్ కొనసాగుతుందని తెలిపారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో సదరం శిబిరాలు

పెద్దపల్లిటౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు సదరం క్యాంపులను రామగుండం, గోదావరిఖని ప్రభుత్వ హాస్పిటల్‌లో నిర్వహిస్తున్నట్లు అదనపుజిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి రవీందర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో నవంబర్24న శారీరక వికలాంగులకు, నవంబర్17న మానసిక వికలాంగులకు, నవంబర్28న చెవిటి వారికి, నవంబర్29న కళ్లు, దృష్టి లోపం గల వారికి క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయాతేదీల్లో సదరం(యూడీఐడీ) క్యాంపునకు వికలత్వమునకు సంబంధించిన పూర్తి సమాచారంతో హాజరు కావాలని అన్నారు. క్యాంపునకు హాజరైన తదుపరి సంబంధిత ధ్రువీకరణ సర్టిఫికెట్ (యూడీఐడీ) కార్డు ఇంటి అడ్రస్‌కు పోస్టు ద్వార వస్తుందని తెలిపారు.

సీపీఐ శతాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలి

పెద్దపల్లిటౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఖమ్మంలో జరిగే సీపీఐ శతాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆపార్టీ జిల్లాకార్యదర్శి తాండ్ర సదానందం పిలుపునిచ్చారు. బుధవారం పార్టీ కార్యాలయంలో శతాబ్ది ఉత్సవాల కరపత్రం ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ సీపీఐ వంద సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా ఖమ్మంలో జరిగే భారీ బహిరంగసభను విజయ వంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి పూసాల రమేష్, పట్టణ కార్యదర్శి కల్లపల్లి నవీన్ కుమార్, చంద్రగిరి ఉదయ్, పేర్క సతీష్, మాచర్ల అంజి, తగరం నరేష్, సురేష్, రవి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

చంద్ర పుల్లారెడ్డి వర్ధంతి సభను జయప్రదం చేయండి


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న న్యూడెమోక్రసీ నాయకులు

గోదావరిఖని, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): భారత విప్లవోద్యమ నేత చంద్ర పుల్లారెడ్డి 41వ వర్ధంతి సభ జయప్రదం చేయాలని బుధవారం గోదావరిఖని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఐ కృష్ణ మాట్లాడుతూ దేశంలో నూతనప్రజాస్వామిక విప్లవం విజయవంతం చేయడానికి, అది పురోగమింపచేయడానికి చంద్ర పుల్లారెడ్డి తనకాలమంతా కృషిచేశాడని అన్నారు. హైదరాబాదులో సుందరయ్య విజ్ఞానకేంద్రంలో ఈనెల19న వర్ధంతి సభను ఏర్పాటు చేశామని, ఈ సభకు ప్రజలు కార్మికులు, ప్రజాస్వామ్యవాదులు, మేధావులు హాజరై జయప్రదం చేయ వలసిందిగా వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) న్యూడె మోక్రసీ, ఐఎఫ్‌టీయూ నాయకులు ఈ నరేష్, ఐ రాజేశం, ఎం దుర్గయ్య, జీ మల్లేశం, ఎం కొమరయ్య, పాల్గొన్నారు.

కేఫ్ సెంటర్లపై చర్యలు తీసుకోండి..

కోల్‌సిటీ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో మైనర్ యువతను టార్గెట్ చేసుకుని విచ్చలవిడిగా కేఫ్‌లు ఏర్పాటు చేసి, అందులో స్మోకింగ్ జోన్‌లు ఏర్పాటు చేశారని, వీటిపై కఠినచర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కొంటు సాగర్ బుధవారం రామగుండం నగరపాలక సంస్థ కమిషనర్ అరుణశ్రీకి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ మైనర్లకు సిగరెట్లు అమ్మవద్దని నిబంధనలుఉన్నప్పటికీ వాటినికేఫ్‌సెంటర్ల యజమానులు తుంగలో తొక్కుతున్నారని అన్నారు. దీనిపై మున్సిపల్, పోలీస్‌శాఖ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

విద్యార్థులకు షీ టీంపై అవగాహన

ముత్తారం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టీజీ మోడల్ స్కూల్‌లో బుధవారం విద్యార్థులకు షీ టీంపై అవగాహన సమావేశం నిర్వహించారు. షీటీంమెంబర్ స్నేహలత మాట్లాడుతూ మహిళల భద్రత, ఆన్‌లైన్ మోసాలు, యాంటీ డ్రగ్స్, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, ఎవరైనా చెడుగా మాట్లాడిన, ప్రవర్తించిన తల్లితండ్రులకు తెలపాలన్నారు. ఎవరైనా వేధింపులకు గురిచేస్తే భయపడకుండా 6303923700నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. కార్యక్రమంలో షీటీం సభ్యులు మౌనిక, సురేష్, హెడ్‌మాస్టర్ సంతోష్ పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

- రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు


ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

మంథని, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): వరిధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. స్థానిక పోచమ్మవాడలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని, ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్స్‌లో నూతనంగా నిర్మించిన సింథటిక్ బ్యాడ్మింటన్ కోర్టును ఆయన ప్రారంభించారు. అనంతరం తెలంగాణ టీవర్క్స్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బుక్స్‌ను బుధవారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. తూకంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ధాన్యం అమ్మిన రైతులకు 48గంటల్లోనే వారి ఖాతాల్లో డబ్బులు జమచేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. విద్యార్థులలో ఆలోచనలను పదును పెట్టేందుకు డ్రీమ్, స్టార్ట్, రైస్ సంస్థ కృషి చేస్తుందన్నారు. మంథనిలో యువకులు వ్యవసాయ పవర్ ఫీడర్, ఆధునిక హెల్మెట్ తయారీ ఆవిష్కరణలు చేసేందుకు ముందుకు రావడం సంతోషకరమన్నారు. నూతన అవిష్కరణను ప్రోత్సహించేందుకు మంథనిలో టీవర్క్స్ ఆధ్వర్యంలో డ్రీమ్.స్టార్ట్‌రైస్ సంస్థను ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలోని 20పాఠశాలల్లో ఈసంస్థ ద్వారా ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేస్తున్నామన్నారు. వీటిలో ఆసక్తిగా పాల్గొంటున్న విద్యార్థులకు హైదారాబాద్ లోని టీవర్క్స్ సందర్శనకు ఏర్పాటు చేయాలని కలెక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో కలెక్టర్ కోయ శ్రీహర్ష, టీవర్క్స్ సీఈవో, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అన్నయ్యగౌడ్, ఆర్డీవో సురేష్, పీఏసీఎస్ చైర్మన్ కొత్త శ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్లు కుడుదుల వెంకన్న, వైనాలరాజు, కాంగ్రెస్‌నేతలు శశిభూషణ్ కాచే, ఐలి ప్రసాద్, సెగ్గెం రాజేష్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోండి

రామగిరి: ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. బుధవారం రాత్రి బేగంపేట్‌లో ఏర్పాటు చేసిన ధాన్యంకొనుగోలు కేంద్రాన్ని ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ప్రభుత్వం పాఠశాలల్లో అభివృద్ధికిపనులకు సంబంధించిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, పెద్దసంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

ఉగ్రవాదుల దిష్టి బొమ్మ దహనం


ఉగ్రవాదుల దిష్టి బొమ్మ దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ పేళ్లలను నిరసిస్తూ బుధవారం తెలంగాణ చౌరస్తాలో కాంగ్రెస్‌నాయకులు ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేశారు. ఉగ్రవాదుల చర్యలు దేశ సమగ్రతను దెబ్బతీయ లేవని నాయకులు అభిప్రాయపడ్డారు. కేంద్రప్రభుత్వం ఉగ్రవాదాన్ని అరికట్టడంలో విఫలమైన కారణంగానే ఈబాంబు పేలుళ్లు జరిగినట్టు తెలిపారు. మరిన్ని ఉగ్ర ఘటనలు జరగకుండా కేంద్రం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్ఎస్‌యూఐ పట్ట అధ్యక్షుడు పరకాల ప్రశాంత్ ఆధ్వర్యంలో జరిగిన ఈనిరసనలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుండేటి రాజేష్, జిల్లాఉపాధ్యక్షుడు మారెల్లి రాజిరెడ్డి, నాయకులు సాగంటి శంకర్, చక్రపాణి, చాట్ల సదానందం, అనుము రాములు, పాల్గొన్నారు.

కళ్యాణ్‌నగర్ : దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన ఉగ్రవాద దాడిని నిరసిస్తూ బుధవారం గోదావరిఖని చౌరస్తాలో ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేసి దాడుల్లో మృతిచెందిన వారికి నివాళులర్పించారు. యూత్‌కాంగ్రెస్ నాయకులు మెంటెం ఉదయ్‌రాజ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి కాంగ్రెస్‌నగర అధ్య క్షుడు బొంతల రాజేష్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలో దాడులకు తెగబడిన ఉగ్రవాదులను క్షేత్రస్థాయిలో అంతం చేయాలని అన్నారు. నిఘా సంస్థలు ఉగ్రవాదుల దాడులు జరుగుతాయని చెప్పినప్పటికీ హోంశాఖ మంత్రి పట్టించుకోలేదన్నారు. నిరసనలో కాంగ్రెస్ నాయకులు కాల్వ లింగస్వామి, తిప్పారపు శ్రీనివాస్, నాయిని ఓదెలు, పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ల పోరాటం ఉధృతం చేస్తాం

8లో..

సీడీపీవో ఆఫీసులో..
ఉద్యోగుల ఇష్టారాజ్యం
- సమయపాలన పాటించరూ, విధుల పట్ల అలసత్వం

అందని పశువైద్యం

- మెడికల్ లీవ్ ముగిసినా విధులకు రాని పశువైద్యాధికారి
- మరో వైద్యుడిని ఏర్పాటు చేయని అధికారులు


ఖాళీగా ఉన్న పశువైద్యాధికారి కుర్చీ

ముత్తారం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పశువుల దవాఖానలో వైద్యులు లేక పశువులకు సరైన చికిత్స అందడం లేదని మండలంలోని ఆయా గ్రామాల రైతులు, పశుపోషకులు ఆవేదన చెందుతున్నారు. ఇక్కడ పనిచేస్తున్న పశువైద్యాధికారి అనారోగ్యానికి గురికావడంతో గతనెల నుంచి ఈనెల8వరకు సెలవులో ఉంటోంది. అయితే సెలవుల్లో ఉన్న సమయంలో ప్రత్నామ్నయంగా ప్రభు త్వం మరో వైద్యుడిని నియమించాల్సి ఉండగా అలాంటిదేమీ చేయలేదు. దీంతో అటెండరే డాక్టర్‌పాత్ర పోషిస్తున్నట్లు రైతులు పేర్కొం టున్నారు. అనుకోని ప్రమాదాలు వస్తే ఎక్క డికి వెళ్లాలో అర్థం కాని పరిస్థితిగా నెలకొం దని పాడిరైతులు ఆవేదన చెందుతున్నారు. కొందరురైతులు ప్రైవేటు వైద్యులను ఆశ్రయిస్తున్నారు. ప్రభుత్వఆసుపత్రిలో కాకుండా ప్రైవేటువ్యక్తుల వద్ద వైద్యం చేయిస్తే డబ్బులు ఎక్కువఅవుతున్నాయని పశుపోషకులు ఆందోళన చెందుతున్నారు. త్వరగా వైద్యుడిని నియమించాలని కోరుతున్నారు. ఈ విషయమై జిల్లా పశువైద్యాధికారి శ్రీనివాస్‌ను వివరణ కోరగా, ప్రస్తుతం ఆమెకు ఆరోగ్యం కుదుటపడలేదని, అదనపువైద్యాధికారిని నియమిస్తామని తెలిపారు.

క్షయరహిత గ్రామాలుగా తీర్చిదిద్దడమే లక్ష్యం

ముత్తారం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): టీబీరహిత గ్రామాలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని టీబీ అలర్ట్ ఇంపాక్ట్ ఇండియా ప్రాజెక్టు అధికారులు పేర్కొన్నారు. బుధవారం టీబీ చాంపియన్స్‌తో గ్రామాల్లో టీబీపై అవగాహన కల్పిస్తూ, లక్షణాలను వివరించారు. మందులు, జాగ్రత్తలు, సూచనలు, సలహాను అందిస్తున్నారు. ఈ మేరకు ముత్తారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఆమ్‌సెంటర్ల టీబీ చాంపియన్స్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తిస్తే వెంటనే నయం చేయవచ్చని అన్నారు. రెండువారాలకు మించి దగ్గు, తెమడ ఉంటే వెంటనే వ్యాధి నిర్ధారణ చేసుకొని, మందులు వాడాలన్నారు. ప్రతిప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో క్షయ మందులు ఉచితంగా లభిస్తున్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని పలువురికిసూచించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్, సిబ్బంది, హెచ్ఈవో, హెల్త్ సూపర్‌వైజర్, ఏఎన్ఎం, ఆశాలు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ పైపులు లీక్..

- వృథాగా పోతున్న నీరు
- పట్టించుకోని అధికారులు


పంచాయతీ ఆఫీస్ ఎదుట పైప్‌లైన్ లీకేజీ నీరు

సుల్తానాబాద్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రేగడిమద్దికుంట గ్రామంలో మిషన్ భగీరథ పైప్‌లైన్లు పగిలి నీరువృథాగా పోతోంది. నీరంతా రోడ్డుపై చేరుతుండడంతో నడకదారిన వెళుతన్న ప్రజలకు ఇబ్బందిగా మారింది. అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు పేర్కొంటున్నారు. గ్రామపంచాయతీ ఎదురుగానే ఈ దుస్థితి నెలకొన్నా అధికారులెవరూ పట్టించుకోవడం లేదు. పైపులు మాత్రం నాలుగుచోట్ల పగిలిపోయి ఉన్నాయని గ్రామస్థులు పేర్కొన్నారు. అధికారులు పట్టించుకొని మరమ్మతులు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడి మృతి

● భార్యకు తీవ్ర గాయాలు


ఆవుల రవి(ఫైల్)

కరీంనగర్ క్రైం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ కోర్టు సమీపంలో బుధవారం మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఆవుల రవి(42) దుర్మరణం చెందాడు. అతని భార్య సంతోషినికి తలకు గాయాలయ్యాయి. త్రీటౌన్ సీఐ జి జాన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం కేశవాపూర్ గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో ఎస్‌జీటీగా పనిచేస్తున్న ఆవుల రవి కరీంనగర్‌లోని రాంనగర్‌లో నివాసం ఉంటున్నాడు. బుధవారం మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో భార్య సంతోషిణితో కలిసి మోటార్‌సైకిల్‌పై కోర్టు చౌరస్తా నుంచి మంచిర్యాల చౌరస్తా వైపునకు వెళ్తున్నారు. రోడ్డు పక్కన పార్క్ చేసి ఉన్న కారును డ్రైవర్ హటాత్తుగా రోడ్డుపైకి రావటంతో వీరి బైక్‌ను కారు ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న ఆవుల రవి కుడిపక్కకు, ఆయన భార్య సంతోషిణి ఎడమ పక్కకు రోడ్డుపై పడిపోయారు. అదే సమయంలో అదేదారిలో ఒక ట్యాంకర్ అతివేగంగా వచ్చి రవిని ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన ఉపాధ్యాయుడు రవి అక్కడికక్కడే మృతి చెందాడు. సంతోషిణి తలకు గాయాలు కాగా ఆసుపత్రికి తరలించారు. మృతుడు రవికి కొడుకు రిత్విక్, కూతురు హాసిని ఉన్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ జాన్‌రెడ్డి తెలిపారు.

బావిలో దూకి విద్యార్థి ఆత్మహత్య


విశ్వతేజ్(ఫైల్)

పెద్దపల్లిటౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): బావిలో దూకి ఓ విద్యార్థి బుధవారం ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాల్లోకి వెళ్తే పెద్దపల్లి పట్టణంలోని భూంనగర్‌కు చెందిన వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మెన్ ఈర్ల స్వరూప సురేందర్‌ల ఏకైక కుమారుడు విశ్వతేజ్(17) కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ కాలేజీలో ఇంటర్ సెకండియర్ చదువుతున్నాడు. మంగళవారం కాలేజీ నుంచి ఇంటికి వచ్చిన విశ్వతేజ్ సాయంత్రం వరకు స్నేహితులతో గడిపాడు. అనంతరం బంధంపల్లి వద్ద రాజీవ్‌రహదారి పక్కన ఉన్న వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు ఆచూకీ కోసం బంధువులు, స్నేహితుల ఇళ్లలో వెతికారు. ఫోన్లు చేసి తెలుసుకునే ప్రయత్నం చేశారు. బుధవారం ఉదయం బంధంపల్లి బావి వద్ద సెల్ ఫోన్, చెప్పులు కనిపించడంతో తల్లిదండ్రులకు సమాచారం అందింది. దీంతో జాలర్లను పిలిపించి బావి అంతా వెతికించారు. సుమారు గంట పాటు వెతకగా మృతదేహం లభించింది. తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



కరీంనగర్ అంబేద్కర్ స్టడీ సర్కిల్

అంబేడ్కర్ స్టడీ సర్కిల్


స్టడీ సర్కిల్‌లో విద్యార్థులు

- నిష్ణాతులైన అధ్యాపకులతో శిక్షణ
- ఇప్పటి వరకు ఉద్యోగాలు సాధించిన 286 మంది అభ్యర్థులు

గణేశ్‌నగర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ రంగాల్లో ఎన్నిక అవకాశాలున్నా ప్రభుత్వ ఉద్యోగాలకున్న విలువ ఎప్పటికీ తగ్గదు. అందుకే వందల్లో ఉద్యోగాలుంటే లక్షల్లో దరఖాస్తులు వస్తుంటాయి. యువత ప్రభుత్వ ఉద్యోగాల కోసం కష్టపడి చదువుతున్నారు. అటువంటి వారికి మార్గనిర్దేశం చేస్తూ అవసరమైన శిక్షణ అందిస్తోంది ఎస్సీ స్టడీ సర్కిల్. ప్రైవేట్ సంస్థల్లో లక్షలు పెట్టి చదవలేని వారికి అండగా నిలుస్తోంది. 2016 సంవత్సరంలో కరీంనగర్‌లో అంబేడ్కర్ స్టడీ సర్కిల్ ఏర్పాటైంది. ఇక్కడ శిక్షణ తీసుకున్న 286 మంది అభ్యర్థులు ఉద్యోగాలను సాధించారు.

● అర్హత.. శిక్షణ.. సౌకర్యాలు

కనీసం డిగ్రీ పాసై వార్షిక ఆదాయం మూడు లక్షల రూపాయల లోపు ఉన్న ఉమ్మడి జిల్లాకు చెందిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ అభ్యర్థులు అర్హులు tsstudycircle.co.in అనే వెబ్సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. కరీంనగర్ జిల్లా కేంద్రంలో ప్రవేశ పరీక్ష నిర్వహించి ప్రతిభ కనపరచిన వంద మందికి ఐదు నెలలపాటు ఉచిత శిక్షణను అందిస్తారు. ఫౌండేషన్ కోర్స్ పేరున ఇస్తున్న ఈ శిక్షణలో పలు నోటిఫికేషన్ల సిలబస్‌ను కవర్ చేసే విధంగా నిష్ణాతులైన అధ్యాపకులు బోధిస్తారు. ఉచిత శిక్షణ, ఉచిత భోజన వసతి ఉంటుంది. ఇతర అలవెన్స్‌ల కింద పుస్తకాల కొనుగోలుకు ఒక్కరికి 2500 రూపాయలు ఇస్తారు. నోట్‌బుక్స్, బౌండెడ్ మెటీరియల్ ఉచితంగా ఇస్తారు. ఇప్పటి వరకు రెసిడెన్షియల్ విధానంలో 10 బ్యాచ్‌లలో 918 మందికి, నాన్ రెసిడెన్షియల్ విధానం లో 2 బ్యాచ్‌లలో 264 మందికి శిక్షణ ఇచ్చారు. మొత్తం 12 బ్యాచ్‌లలో 1,182 మంది శిక్షణ పొందగా వారిలో ఇప్పటి వరకు 286 మంది ఉద్యోగాలను సాధించారు. మరో 16 మంది ఉద్యోగాలకు ఎన్నికయ్యారు. వారికి నియామకపత్రాలు రావాల్సి ఉంది.

నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలి

-బండ శ్రీనివాస్,
అంబేడ్కర్ స్టడీ సర్కిల్ డైరెక్టర్



విద్యార్థులు డిగ్రీ కనీస అర్హతతో వ్రాయడానికి వీలైన అన్ని పోటీ పరీక్షలకు శిక్షణ ఇస్తున్నాం. ఆడియో, వీడియోల బోధన ఉంటుంది. మోడల్ టెస్టులు నిర్వహించి అభ్యర్థుల సామర్థ్యాన్ని తెలుసుకుంటున్నాం. ఉచిత శిక్షణను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలి.

శిక్షణ చాలా ఉపయోగపడింది..

- గొల్లపల్లి రాజు, డిప్యూటీ తహసీల్దార్



డబ్బులు చెల్లించి కోచింగ్ తీసుకునే పరిస్థితి లేని సమయంలో కరీంనగర్ అంబేడ్కర్ స్టడీ సర్కిల్‌లో ఇచ్చిన కోచింగ్ నాకు చాలా ఉపయోగ పడింది. ఐదు నెలల శిక్షణను సద్వినియోగం చేసుకుని ప్రభుత్వ ఉద్యోగం సాధించాను. మాకు ఇచ్చిన కోచింగ్, మెటీరియల్ చాలా ఉపయోగపడింది.

నాణ్యమైన కోచింగ్ ఇస్తున్నారు..

- బి ధనుంజయ్, సూపరింటెండెంట్, పీవీ నరసింహరావు వెటర్నరీ యూనివర్సిటీ



అంబేడ్కర్ స్టడీ సర్కిల్‌లో నాణ్యమైన కోచింగ్ ఇస్తున్నారు. ఇక్కడ కోచింగ్ తీసుకున్న తర్వాతే ఉద్యోగం సాధించగలనని నమ్మకం కలింది. ఉద్యోగ ప్రయత్నంలో ఉన్న వారు ఇక్కడ కోచింగ్ తీసుకుని ఉన్నత ఉద్యోగాలు సాధించవచ్చు.

టిప్పర్ ఢీకొని గొర్రెల మృతి


మృతి చెందిన గొర్రెలు

కాల్వశ్రీరాంపూర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెగడపల్లి గ్రామశివారులో టిప్పర్ ఢీకొని తొమ్మిది గొర్రెలు అక్కడిక్కడే మృతిచెందాయి. మరికొన్ని గొర్రెలకు గాయాలయ్యాయి. బుధవారం పెగడపల్లి శివారులోని శ్రీమల్లి కార్జున ఫంక్షన్ హాల్ సమీపంలో ఓ టిప్పర్ గొర్రెలను ఢీకొంది. ఇందులో తొమ్మిది గొర్రెలు మృతిచెందగా, రెండు గొర్రెలకు తీవ్ర గాయాలయ్యాయి. సుల్తానాబాద్ నుంచి కాల్వశ్రీరాంపూర్ వస్తున్న టిప్పర్ రోడ్డు దాటుతున్న గొర్రెలను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రూ.1.50 లక్షల నష్టం వాటిల్లిందని యజమాని పల్లపు మల్లయ్య పేర్కొన్నాడు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

సుల్తానాబాద్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొంతకుంటపల్లి గ్రామంలో విద్యుదాఘాతంతో ఒక గేదె మృతి చెందింది. బుధవారం గ్రామానికి చెందిన లింగంపల్లి కొమురయ్య గేదె మేతకు వెళ్లగా అక్కడ నీటిలో ఉన్న ఐరన్ విద్యుత్ స్తంభానికి తాకి విద్యుదాఘాతంతో మృతి చెందింది. గేదె విలువ రూ.60 వేల వరకు ఉంటుందని, తనకు నష్టపరిహారం ఇప్పించి ఆదుకోవాలని రైతు కొమురయ్య విద్యుత్‌శాఖ అధికారులకు ఫిర్యాదు చేశాడు.

దాడి చేసిన వ్యక్తిపై కేసు

కోల్‌సిటీ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పాత కక్షలను దృష్టిలో పెట్టుకుని గోదావరిఖని విఠల్‌నగర్‌కు చెందిన కనకం గణేష్‌పై మంగళవారం రాత్రి దాడికి పాల్పడిన నల్లగొషాల రంజిత్, అతని భార్య లతపై కేసు నమోదు చేసినట్టు గోదావరిఖని వన్‌టౌన్-2 సీఐ రవీందర్ తెలిపారు. కనకం గణేష్ మోటార్ సైకిల్‌పై ఇంటికి వెళుతుండగా అదే కాలనీకి చెందిన రంజిత్ తనను ఇంటి వద్ద దింపాలని కోరాడు. అతన్ని ఇంటి వద్ద దింపిన తరువాత తనపై ఎక్సైజ్ పోలీసులకు ఫిర్యాదు చేస్తావా అంటూ కులం పేరుతో దూషిస్తూ కర్రలు, ఇనుప రాడ్లతో దాడి చేసి చంపేస్తానని బెదిరింపులకు పాల్పడ్డాడని, అతని భార్యను కత్తి తీసుకురా అని పురమాయించినట్టు తెలిపారు. గణేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రంజిత్, అతని భార్య లతపై కేసు నమోదు చేసినట్టు సీఐ పేర్కొన్నారు.

లంచం అడిగారా... 1064కు కాల్ చేయండి

● 10 నెలల్లో 22 కేసులు, 35 మంది అరెస్టు ● ఉమ్మడి కరీంనగర్ ఏసీబీ డీఎస్‌పీ విజయ్ కుమార్



కరీంనగర్ క్రైం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): విధిగా చేయాల్సిన పనికోసం ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగి లంచం డిమాండ్ చేస్తే వెంటనే ధైర్యంగా అవినీతి నిరోధకశాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని ఉమ్మడి కరీంనగర్ ఏసీబీ డీఎస్‌పీ విజయ్‌కుమార్ కోరారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... సమాజంలో అవినీతి ఒక పెద్ద సమస్యగా మారిందన్నారు. ఆ అవినీతి జాడ్యాన్ని అరికట్టే శక్తి మన చేతుల్లోనే ఉందన్నారు. లంచం అడగడం నేరమని, లంచం తీసుకోవడం కూడా నేరమని, లంచం ఇవ్వడం కూడా నేరమని తెలిపారు. ప్రతి ప్రభుత్వ ఉద్యోగి ప్రజలకు జవాబుదారీగా ఉండాలని, పౌరులకు సేవలు అందించాల్సిన ఉద్యోగి విధులను మరచి అవినీతికి పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఏ స్థాయిలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగి అయినా లంచం అడిగితే భయపడకుండా వెంటనే 1064 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేయాలని సూచించారు. ఏసీబీ పోలీసులకు నేరుగా ఫిర్యాదు చేయాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారి పేరు, వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచుతామన్నారు. ప్రజలు అవినీతిపై చైతన్యవంతులై తిరగబడితేనే అవినీతి రహిత తెలంగాణ సాధ్యమన్నారు. సత్యం కోసం, మన కర్తవ్యం కోసం, అవినీతి రహిత తెలంగాణ కోసం సంకల్పంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. 2025 సంవత్సరంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రభుత్వ శాఖల ఉద్యోగులు లంచం డబ్బులు తీసుకుంటుండగా ఇప్పటి వరకు 22 కేసుల్లో 35 మంది ఉద్యోగులు, వారి సహాయకులను అరెస్టు చేసి జైలుకు తరలించామన్నారు. ఇందులో రెవెన్యూశాఖకు చెందిన ఎనిమిది మంది ఉద్యోగులు, పంచాయతీ రాజ్ శాఖ-6, స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ- 3, ఖజానా శాఖ 3, మున్సిపల్-3, వ్యవసాయశాఖ-3, డ్రగ్ కంట్రోల్-3, ఆర్‌టీఏ-3, పోలీసుశాఖలో ఒక కేసు నమోదు చేసి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకున్నామని ఏసీబీ డీఎస్పీ విజయ్‌కుమార్ తెలిపారు.

జీవితంపై విరక్తి చెంది ఒకరి ఆత్మహత్య

సుల్తానాబాద్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జీవితంపై విరక్తిచెంది, మద్యానికి బానిసైన ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్లు సుల్తానాబాద్ ఎస్ఐ శ్రావణ్‌కుమార్ బుధవారం రాత్రి తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం.. సుల్తానాబాద్ మండలంలోని తొగర్రాయి గ్రామానికి చెందిన జెట్టి రాజ కొమురయ్య(60) భార్య నాలుగు సంవత్సరాల క్రితం మృతిచెందింది. అప్పటి నుంచి మద్యానికి బానిసగా మారాడు. తీవ్రమానసిక వేదనకు గురై కొడుకు సదయ్య చెంతనే ఉంటున్నాడు. మంగళవారం రాత్రి కదంబాపూర్ శివారులో ఉన్న తమ పొలం వద్ద గల వ్యవసాయ బావి దగ్గరకు వెళ్లి వెంటతెచ్చుకున్న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అపస్మారక స్థితిలో ఉన్న తండ్రిని చూసిన కొడుకు వెంటనే కొమురయ్యను సుల్తానాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్సకోసం అతన్ని కరీంనగర్‌లో ఆస్పత్రిలో చేర్పగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రావణ్ తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరికి గాయాలు

పెద్దపల్లి రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుర్మపల్లి గ్రామ శివారులో గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పాలకుర్తికి చెందిన పరశురాం అనే వ్యక్తి కాలినడకతో వెళ్తున్న క్రమంలో గుర్తుతెలియని వాహనం ఢీకొంది. దీంతో పరశురాంనకు తీవ్రగాయాలు కాగా పెద్దపల్లి ఆసుపత్రికి తరలించినట్లు పేర్కొన్నారు. సంఘటనపై ఎలాంటి ఫిర్యాదు రాలేదని పెద్దపల్లి రూరల్ ఎస్ఐ మల్లేష్ తెలిపారు.

జీడీకే11ఇంక్లైన్‌లో ప్రమాదం

● ముగ్గురు కార్మికులకు గాయాలు

గోదావరిఖని, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆర్‌జీ-1 పరిధిలోని జీడీకే 11ఇంక్లైన్‌లో బుధవారం గనిలో ప్రమాదం జరిగింది. రెండవ షిఫ్టులో పనిచేస్తున్న ముగ్గురు కార్మికులకు గాయాలయ్యాయి. ఎల్‌హెచ్‌డీ సెక్షన్‌లో ఎల్‌హెచ్‌డీలు నడుపుతున్న క్రమంలో వాహనం వెనుక పనులు చేస్తున్న కార్మికులు రంజిత్, శ్రీకాంత్, ప్రవీణ్‌కు అక్కడున్న కేబుల్ వైర్ బలంగా తాకినట్టు తెలిసింది. దీంతో వారు కిందపడ్డారు. శ్రీకాంత్, ప్రవీణ్‌కు స్వల్ప గాయాలు కాగా, రంజిత్‌కు బలమైన గాయాలు తగిలాయి. స్థానిక సింగరేణి ఏరియా ఆసుపత్రిలో వీరికి చికిత్స అందిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

సుల్తానాబాద్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాట్నపల్లి నర్సయ్యపల్లి గ్రామాల మధ్య జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి శివారులో గల ఇటుక బట్టీలో పనిచేస్తున్న ఓ కార్మికుడు బుధవారం రాత్రి రాజీవ్‌రహదారి దాటుతుండగా రోడ్డుపై వెలుతున్న ద్విచక్ర వాహనం ఢీకొంది. ప్రమాదంలో కార్మికుడితో పాటు ద్విచక్రవాహనం నడుపుతున్న వ్యక్తి కూడా తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడ్డ వారిని సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

బిల్డింగ్ పైనుంచి పడి ఒకరికి తీవ్ర గాయాలు

రుద్రంగి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): బిల్డింగ్‌కు నీళ్లు పడుతుండగా ప్రమాదవశాత్తు ఓ వ్యక్తి కిందపడి తీవ్రగాయాలపాలైన సంఘటన రుద్రంగి మండల కేంద్రంలో బుధవారం ఉదయం జరిగింది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. రుద్రంగికి చెందిన గంధం శంకర్ తన ఇంటి నిర్మాణంలో భాగంగా గోడలకు నీళ్లు పడుతున్న క్రమంలో ఒక్కసారిగా మొదటి అంతస్తు నుంచి కిందపడ్డాడు. దీంతో తలకు, నడుముకు తీవ్రగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు కరీంనగర్‌లో ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిపారు.

రిటైర్డ్ ఏఎస్సై రామచంద్రం కన్నుమూత


రాంచంద్రం(ఫైల్)

కరీంనగర్ క్రైం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పోలీస్ శాఖలో సీనియర్ ఫొటోగ్రాఫర్‌గా పనిచేసి, రిటైర్డ్ అయిన ఏఎస్సై మడుపు రామచంద్రం(69) బుధవారం అనారోగ్యంతో కరీంనగర్‌లోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. రామచంద్రం అంత్యక్రియలు ఆయన స్వగ్రామం కరీంనగర్ రూరల్ మండలం బొమ్మకల్‌లో గురువారం మధ్యాహ్నం నిర్వహించనున్నారు. రాంచంద్రం మృతికి పలువురు పోలీసు అధికారులు, సిబ్బంది సంతాపం తెలిపారు. సుదీర్ఘకాలంపాటు పోలీస్ శాఖకు రామచంద్రం అందించిన సేవలు మరువలేనివన్నారు. సీనియర్ ఫొటోగ్రాఫర్‌గా ఆయన చేసిన కృషి ఎంతోమందికి ఆదర్శప్రాయమన్నారు.

పెద్దమ్మ ఆలయంలో పోతరాజు విగ్రహం ధ్వంసం

ఓదెల, నవంబర్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొత్కపల్లిలో బుధవారం పెద్దమ్మతల్లి ఆలయంలో నిర్మించిన పోతరాజు విగ్రహాన్ని గుర్తుతెలియని వ్యక్తి ధ్వంసం చేశాడు. రాత్రి మద్యం సేవించిన ఒకవ్యక్తి పొత్కపల్లి రైల్వేస్టేషన్ నుంచి వస్తూ విగ్రహాన్ని ధ్వంసం చేసినట్లు తెలిసింది. ఆ వ్యక్తిని పోలీసులకు అప్పగించారు.

బహ్రెయిన్‌లో జగిత్యాల యువకుడి ఆత్మహత్య

● పుట్టిన రోజునే ఘటన
● జగిత్యాలలో మిన్నంటిన రోదనలు


జగిత్యాలలో రోదిస్తున్న కుటుంబ సభ్యులు , కళ్యాణ్ (ఫైల్)

జగిత్యాల టౌన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఎదిగిన కొడుకు కుటుంబానికి ఆసరాగా ఉంటాడని గల్ఫ్‌కు పంపిస్తే ఏం జరిగిందో ఏమే కానీ పుట్టిన రోజునే తల్లిదండ్రులతో సంతోషంగా మాట్లాడిన ఆ యువకుడు ఆతహత్య చేసుకుని ఆ కుటుంబంలో విషాదం నింపాడు. మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాల జిల్లా కేంద్రంలోని టాకా సందిలో ఉంటున్న అనుమల్ల శంకర్ ఓ కలర్స్ దుకాణంలో గుమస్తాగా పనిచేస్తుండగా ఆయన భార్య లావాణ్య ఆశ వర్కర్‌గా పని చేస్తున్నారు. వారికి కల్యాణ్ (26)కొడుకు, ఒక కూతురు ఉన్నారు. ఎదిగిన కొడుకును గల్ఫ్‌కు పంపితే నాలుగు రూపాయలు సంపాదించి ఇంటికి చేదోడుగా ఉంటాడని 10 నెలల క్రితం కల్యాణ్‌ను బహ్రెయిన్ దేశానికి పంపించారు. అక్కడ ఓ సర్వీసింగ్ సెంటర్లో పనిచేస్తూ ప్రతి నెలా ఇంటికి డబ్బులు పంపించేవాడు. మంగళవారం రోజున కళ్యాణ్ బర్త్‌డే సందర్భంగా కుటుంబ సభ్యులతో కూడా చాలా సంతోషంగా మాట్లాడాడు. రాత్రి ఏం జరిగిందో ఏమోకానీ ఉదయం చూసేసరికి తన గది వద్ద కల్యాణ్ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయాన్ని కల్యాణ్ స్నేహితులు జగిత్యాలలో ఉన్న తల్లిదండ్రులకు సమాచారం అందించారు. దీంతో ఆ కుటుంబంలో విషాద చాయలు అలుముకున్నాయి. తన కొడుకుకు ఎలాంటి ఇబ్బందులు లేవని, ఎప్పుడు తమతో సంతోషంగానే మాట్లాడేవాడని బర్త్‌డే సందర్భంగా కూడా మాతో ఫోన్‌లో సంతోషంగానే మాట్లాడాడని అంతలోనే ఏం జరిగిందో అంతుపట్టడం లేదని యువకుడి తండ్రి రోదిస్తూ తెలిపాడు. ఆత్మహత్యకు కారణాలు తెలుసుకొని మృతదేహాన్ని త్వరగా తెప్పించే ఏర్పాటు చేయాలని వేడుకుంటున్నాడు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి గాయాలు

వెల్గటూర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): వెల్గటూర్ మండల కేంద్రంలో బుధవారం ఓ యువకుడు ఎనగందుల పోచయ్య అనే వృద్ధుడిని ఢీ కొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. బుధవారం సంత కావడంతో పోచయ్య సంత నుంచి నడుచుకుంటూ వెళ్తున్నాడు. అదే సమయంలో శాఖాపూర్‌కు చెందిన యువకుడు బైక్‌పై వెళ్తూ వృద్ధుడిని ఢీకొట్టాడు. ఈ సంఘటనలో వృద్ధుడు కింద పడడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పోచయ్యను జగిత్యాల ఆసుపత్రికి తరలించారు. కాగా అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

ట్రాలీ బోల్తా.. తప్పిన ప్రాణాపాయం


రోడ్డుపై పడిపోయిన ఫైబర్ కర్రలు

వెల్గటూర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): వెల్గటూర్ మండలం రాజక్కపల్లి వద్ద రాష్ట్ర రహదారిపై బుధవారం ట్రాలీ బోల్తా పడగా భారీ సంఖ్యలో వాహనాలు నిలిచి పోయాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్ గోషామహల్ నుంచి ఫైబర్ లోడ్‌తో లక్షెట్టిపేట వైపు వస్తున్న ట్రాలీ రాజక్కపల్లి సమీపంలో టైరు పేలడంతో రాష్ట్ర రహదారిపై బోల్తా పడింది. ఈ సంఘటనలో డ్రైవర్ స్వల్ప గాయాలతో బయట పడడంతో ప్రాణాపాయం తప్పింది. ట్రాలీ ఉన్న ఫైబర్ కర్రలు చెల్లాచెదురుగా రోడ్డుపై పడిపోయాయి. దీనితో రహదారిపై భారీ సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. అదే గ్రామానికి చెందిన మాజీ ఏఎంసీ ఛైర్మన్ పత్తిపాక వెంకటేష్ స్పందించి స్థానిక యువకుల సహాయంతో కర్రలను తొలగించారు. కాగా ట్రాలీ వెనుక ముందు ఎలాంటి వాహనాలు రాక పోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఏఎస్సై శ్రీనివాస్ సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.

భక్తుల దారి దోపిడీ

● బంగారు పుస్తెల తాడు, నగదు లాక్కెల్లిన అగంతకుడు



వృద్ధుడిని వివరాలు అడిగి తెలుసుకుంటున్న పోలీసులు

వేములవాడ టౌన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): నాంపల్లి లక్ష్మీనర్సింహస్వామి దర్శనానికి ఆటోలో వెళుతున్న భక్తులను లక్ష్యంగా చేసుకున్న అగంతకుడు వెంబడించి బుధవారం దారి దోపిడీకి పాల్పడ్డాడు. కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలంలోని అన్నారం గ్రామానికి చెందిన దేవుపల్లి బూధవ్వ, చంద్రయ్య అనే వృద్ధ దంపతులు వేములవాడ రాజరాజేశ్వరస్వామి దర్శనం చేసుకొని నాంపల్లికి వెళుతున్నారు. వేములవాడ తిప్పాపూర్ బస్టాండ్ నుంచి నాంపల్లి దేవాలయానికి వెళ్లేందుకు భక్తులు ఆటోలో ఎక్కగా మార్గమధ్యలో ఒక వ్యక్తి, మరోచోట ఇంకో వ్యక్తి ఎక్కారు. నాంపల్లి కమాన్ వద్ద భక్తులు దిగగానే అగంతకుడు దిగి వారిని వెంబడించి నడుచుకుంటూ వెళుతున్న దంపతులను చంపుతానని బెదిరించి రెండున్నర తులాల బంగారు పుస్తెల తాడు, రూ. 2వేల నగదు లాక్కొని పరారయ్యాడు. బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేయగా కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

- మరొకరికి తీవ్ర గాయాలు


హర్షిత్(ఫైల్)

హుజూరాబాద్ రూరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని సిర్సపల్లి క్రాస్ రోడ్డు వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువ కుడు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం... మండలంలోని పోతిరెడ్డిపేటకు చెందిన నందిపేట హర్షిత్(18), అతడి బంధువు త్రివేష్ ద్విచక్ర వాహనంపై హుజూరాబాద్ వైపు వెళ్తున్నారు. సిర్సపల్లి క్రాస్ రోడ్డు సమీపంలోకి రాగానే వేగంగా వచ్చిన గుర్తు తెలియని వాహనం ద్విచక్ర వాహనాన్ని ఢీంది. ఈ ప్రమాదంలో హర్షిత్, త్రినేష్ ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు వారిని చికిత్స నిమిత్తం వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ నందిపేట హర్షిత్ మృతి చెందాడు. ఈ సంఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కరుణాకర్ తెలిపారు.

ఒకరి ఆత్మహత్య


శ్రీనివాస్(ఫైల్)

యైటింక్లయిన్ కాలనీ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధి కాలనీలోని భాస్కర్‌రావు నగర్‌కు చెందిన బండారి శ్రీనివాస్(42) బుధవారం ఉరి వేసు కుని ఆత్మహత్య చేసుకున్నాడు. సాయం త్రం ఇంట్లో ఎవరూలేని సమయంలో బెడ్‌రూంలో చీరతో సీలింగ్‌కు ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. తాడిచర్ల ఓసీపీలో బ్లాస్టింగ్ సెక్షన్‌లో ప్రైవేట్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న శ్రీనివాస్ పెళ్లిరోజు బుధవారం కావడం తో కుటుంబంలో విషాదం నింపింది. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. శ్రీనివాస్ మృతికి కారణాలు తెలియరాలేదు. పోలీసులు మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గోదావరిఖని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

16న ఉమ్మడి జిల్లాస్థాయి
జూనియర్స్ ఖో-ఖో పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాస్థాయి జూనియర్స్ ఖో-ఖో పోటీలను ఈ నెల 16న కోరుట్లలో నిర్వహించనున్నట్లు జిల్లా ఖో-ఖో అసోసియేషన్ అధ్యక్షుడు, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మహేందర్‌రావు తెలిపారు. కోరుట్ల స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉదయం 9:30 గంటల నుంచి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ పోటీల్లో కరీంనగర్ నుంచి రెండు బాలుర, ఒక బాలికల జట్టు, జగిత్యాల నుంచి రెండు బాలుర, ఒక బాలికల జట్టు, సిరిసిల్ల నుంచి రెండు బాలుర, ఒక బాలికల జట్టు పాల్గొనేందుకు అర్హులని తెలిపారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచే జట్లకు నగదు బహుమతులతోపాటు ప్రతిభచాటే క్రీడకారులను రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. బాలబాలికల ఎత్తు, వయస్సు, బరువు మొత్తం కలిసి 250 పాయింట్లు దాటకూడదని పేర్కొన్నారు. పోటీలను లీగ్‌కం నాకౌట్ పద్ధతిలో నిర్వహించనున్నామని తెలిపారు. ఇతర వివరాలకు పోటీల నిర్వాహక కార్యదర్శి వి.నవీన్‌కుమార్ 8341136941 నంబరులో సంప్రదించాలని సూచించారు.

పత్రికలు చదవడం పెరగాలి
- ప్రింట్ మీడియా డిస్ట్రిబ్యూషన్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సత్యం


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అసోసియేషన్ నాయకులు

సిరిసిల్ల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్ వినియోగం తగ్గించుకుని పత్రికలు చదవాలని ప్రింట్ మీడియా డిస్ట్రిబ్యూటర్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వనమల సత్యం అన్నారు. బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర ప్రింట్ మీడియా డిస్ట్రిబ్యూటర్ అసోసియేషన్ సమావేశలో మాట్లాడారు. డిస్ట్రిబ్యూషన్ కమిషన్ పెంచాలని అన్నారు. రాష్ట్ర కోశాధికారి ఉప్పు రాజేందర్, రాష్ట్ర ఆర్గనైజర్ కార్య దర్శి రణం రవీందర్‌గౌడ్, రాష్ట్ర సహాయ కార్యదర్శి కురికాల ప్రసాద్, రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు పోచపల్లి రాజు ఉన్నారు.

రాజన్న దర్శనాల నిలిపివేత

- అర్ధరాత్రి తర్వాతనే ప్రధాన ద్వారం మూసివేత
- ముందస్తు సమాచారం లేకపోవడంతో భక్తుల ఆందోళన
- భీమేశ్వరాలయంలోనే భక్తులకు దర్శనం, ఆర్జిత సేవలు
- ఎల్ఈడీ తెరపై రాజన్న దర్శనం
- అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు


ఎల్ఈడి తెరపై రాజన్నను దర్శించుకుంటున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్


పోలీసు పహారాలో దక్షిణభాగం ప్రధాన ద్వారం

వేములవాడ టౌన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి ఆలయ విస్తరణ, అభివృద్ధి పనుల నేపథ్యంలో స్వామివారి దర్శనాలను బుధవారం తెల్లవారుజామున ముందస్తు సమాచారం లేకుండానే నిలిపివేశారు. భక్తులు ఆలయంలోకి రాకుండా తూర్పువైపున ఉన్న రాజగోపురం దక్షిణం వైపున్న ప్రధాన ద్వారం గేటును మూసివేసి ఇనుప రేకులతో ఫెన్సింగ్ చేశారు. ఆలయం చుట్టూ ఇప్పటికే పడమర, ఉత్తరం వైపు ఎత్తయిన రేకులతో ఫెన్సింగ్ చేసి రక్షణ వలయాన్ని ఏర్పాటు చేశారు. ఆలయ అభివృద్ధి పనుల్లో భాగంగా నెలరోజుల నుంచి కూల్చివేతలు కొనసాగుతున్నాయి. దక్షిణం, ఉత్తర భాగాల్లో ఉన్న ప్రాకారం, పడమర వైపున్న నైవేద్యశాల, ఈవో కార్యాలయం, తూర్పు భాగంలోని కళాభవన్‌లను ఇప్పటికే తొలగించారు. చివరికి మెయిన్ గేట్‌ను ఇనుప రేకులతో మూసివేశారు. కోడె మొక్కులు, ఆర్జిత సేవలు భీమేశ్వరాలయంలో జరుగుతాయని పేర్కొంటూ ప్రధాన ద్వారానికి ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. దర్శనాల నిలిపివేత పనులను ఈవో రమాదేవి, ఆర్డీవో రాధాబాయి, అడిషనల్ ఎస్పీ చంద్రయ్యల సమక్షంలోనే రాత్రంతా ఇంజ నీరింగ్ అధికారులు పూర్తిచేశారు. దీంతో సుప్రభాత దర్శనానికి వచ్చిన భక్తులు ఆలయ గేటు వద్దనే టెంకాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. మరోవైపు పడమర వైపున్న శివుడి విగ్రహం వద్ద కొబ్బరికాయలు కొట్టి దీపాలు వెలిగించారు. ముందస్తు సమాచారం లేకుండా ఆలయంలో దర్శనాలను నిలిపివేయడంపై సర్వత్రా నిరసన వ్యక్తమైంది. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆందోళన వ్యక్తం చేశారు. భీమేశ్వ రాలయంలో సకల ఏర్పాట్లు చేశామని ఆలయ ఈవో రమాదేవి ప్రకటించారు. ఆలయ అభివృద్ధిలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కోరారు. ఆలయంలో ముందస్తు సమాచారం లేకుండా దర్శనాలను నిలిపివేయడాన్ని బీజేపీ నాయకుడు ప్రతాప రామకృష్ణ తీవ్రంగా ఖండించారు.

భీమేశ్వరాలయంలోనే భక్తులకు దర్శనం..

భక్తులు ఇకనుంచి భీమేశ్వరాలయంలో దర్శన ఏర్పాట్లు చేశారు. అన్ని రకాల ఆర్జిత సేవలు, పూజలు భీమేశ్వరాలయంలో చెల్లించేలా ఏర్పాట్లుచేశారు. ఆలయ అభివృద్ధి పనుల దృష్ట్యా రావిచెట్టు వైపు ఏర్పాటుచేసిన ప్రచార రథంలో రాజరాజేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను దర్శించుకునే విధంగా ఏర్పాట్లు చేశారు. అక్కడే ఎల్ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేశారు. గతనెల 20న శృంగేరి పీఠాధిపతి శ్రీవిధుశేఖర భారతితో దీనిని ప్రారంభించారు. ఇకనుంచి ఎల్ఈడీ స్క్రీన్‌లో స్వామివారిని దర్శించుకోవచ్చు.

అభివృద్ధిలో భాగంగానే రాజన్న దర్శనాలకు తాత్కాలిక ఏర్పాట్లు
• ఆలయ ఈవో రమాదేవి

వేములవాడ టౌన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానం అభివృద్ధి పనుల్లో భాగంగానే స్వామివారి దర్శనాలకు తాత్కాలిక ఏర్పాట్లుచేశామని ఈవో ఎల్. రమాదేవి పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం అధికారికంగా ఒక ప్రకటన విడుదల చేశారు. ఆలయ విస్తరణ పనులు వేగవంతం అయినందున భక్తులకు ఇబ్బందులు కలిగే అవకాశం ఉన్నదని గుర్తించి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు శృంగేరి పీఠాధిపతి విధుశేఖర భారతీ మహాస్వామి ఆజ్ఞానుసారం భక్తుల సౌకర్యార్థం ఆలయ రాజగోపురం ఎదురుగా తూర్పువైపు స్వామివారు, అమ్మవార్ల దర్శనం ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటికే భీమేశ్వరాలయంలో ఆర్జిత సేవలైన అభిషేకాలు, అన్నపూజలు, అర్చనలు, కల్యాణాలు ఏర్పాటు చేశామన్నారు. ఇకనుంచి భీమేశ్వరాలయంలో భక్తులు మొక్కులు చెల్లించుకోవాలన్నారు.

జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపిక


విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ అశోక్

జగిత్యాల అగ్రికల్చర్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): జగిత్యాల ఎస్‌కేఎన్ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో బీఏ ప్రథమ సంవత్సరం చదువుతున్న బాలాజీ అనే విద్యార్థి జాతీయ స్థాయి కిక్ బాక్సింగ్ పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ అరిగెల అశోక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఎంపిక పోటీలు శాతవాహన వర్సిటీ పరిధిలో జరిగాయన్నారు. డిసెంబర్‌లో జరగబోయే జాతీయ ఇంటర్ యూనివర్సిటీ ఆల్ ఇండియా బాక్సింగ్ పోటీలు కురుక్షేత్ర విశ్వవిద్యాలయం హర్యానా రాష్ట్రంలో జరుగుతాయని, ఈ పోటీల్లో తమ కళాశాల విద్యార్థి పాల్గొనడం జరుగుతుందని తెలిపారు. ప్రిన్సిపాల్ అశోక్, కళాశాల అధ్యాపకులు, సహచర విద్యార్థులు బాలాజీని అభినందించారు.

వచన కవిత పోటీల్లో విద్యార్థి ప్రతిభ


రాహుల్

ధర్మారం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సారస్వత పరిషత్తు బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని రెండు తెలుగు రాష్ట్రాల పరిధిలో నిర్వహించిన పోటీల్లో మండలంలోని నర్సింహులపల్లి ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న అలిశెట్టి రాహుల్ సత్తాచాటాడు. వచన కవిత, పద్య కవిత, కథ, పుస్తకసమీక్ష, చిత్రలేఖనం అంశాలలో పోటీల నిర్వహించగా రెండు రాష్ట్రాల నుంచి 1200మంది విద్యార్థులు పోస్టు ద్వారా తమ రచనలను పంపారు. న్యాయ నిర్ణేతలు బుధవారం విజేతలను ప్రకటించగా వచన కవిత విభాగంలో రాహుల్ రాసిన 'పెన్ను' కవితకు తృతీయబహుమతి లభించింది. ఈ నెల23న, హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర సారస్వత పరిషత్తు భవనంలో జరిగే సమావేశంలో రాహుల్‌కు 1000రూపాయల నగదు బహుమతితోపాటు జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందించనున్నారు. రాహుల్‌ను ప్రధానోపాధ్యాయుడు రమేష్ నాయక్, ఉపాధ్యాయులున్నారు.

ఉపాధ్యాయ సంఘం కార్యవర్గం

కరీంనగర్ టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): టీఎస్ యూటీఎఫ్ అనుబంధంగా పనిచేస్తున్న తెలంగాణ మైనార్టీ గురుకుల ఉపాధ్యాయ సంఘం (టిమ్రిస్) ఉమ్మడి జిల్లా నూతన కార్యవర్గాన్ని రాష్ట్ర కార్యదర్శి భూపేందర్‌కౌర్, యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ముల్కల కుమార్, కేఎఫ్ జావేద్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఒల్లాల శ్రీనివాస్ (కరీంనగర్), ప్రధాన కార్యదర్శిగా షేక్ బాబా, ఉపాధ్యక్షులుగా రెవోజు స్వామి, అనిత, కోశాధికారిగా జి.సంధ్య, ఆడిట్ కమిటీ కన్వీనర్లుగా నిజాముద్దీన్, ఎం.శ్రావణి, కార్యదర్శులుగా కె.శ్రావణి, క్రాంతికుమార్, జి.సుచరిత, ఎన్.హరికృష్ణ, కె.చిరంజీవి, జి.శ్రీకాంత్, డి.శ్రీలత, సంయుక్త, సాహిత్య, డి.వినోద, ఎ.హరీష్, ఎ.శ్రీలత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మైనార్టీ గురుకుల ఉపాధ్యాయులకు 010 పద్దు కింద వేతనాలు చెల్లించాలని వారు కోరారు.

పెన్షనర్ల సమస్యల సాధనకు పోరాటం

- 17న హైదరాబాద్‌లో మహాధర్నా
- 'రేవా' రాష్ట్ర కన్వీనర్ కోహెడ చంద్రమౌళి


కరపత్రం ఆవిష్కరిస్తున్న పెన్షనర్ల అసోసియేషన్ నాయకులు

కరీంనగర్ టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పెన్షనర్ల సమస్యల సాధనకు పోరాటం చేపట్టినట్లు రిటైర్డు ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ కోహెడ చంద్రమౌళి తెలిపారు. బుధవారం నగరంలోని ప్రైవేట్ కళాశాలలో రిటైర్డు ఎంప్లాయిస్ అసోసియేషన్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా కార్యవర్గ సమావేశాన్ని జిల్లా ఉపాధ్యక్షుడు గద్దె జగదీశ్వరాచారి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రమౌళి మాట్లాడుతూ 2024 మార్చి నుంచి ఇప్పటి వరకు ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులు, ఉపాధ్యాయుల బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఏడాదిన్నరకాలంగా ఉద్యోగ విరమణ చెందిన ఉద్యోగులకు రావాల్సిన జీపీఎఫ్, జీఐఎస్, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, కమ్యూటేషన్, గ్రాట్యూటీ అందలేదని ఆవేదన చెందారు. బకాయిలు అందకపోవడంతో పెన్షనర్లు ఇబ్బందులు పడుతున్నారని, గతంలో ఇలాంటి పరిస్థితి ఉండేది కాదని అన్నారు. ఈ విషయమై ప్రభుత్వానికి ఎన్నిసార్లు విన్నవించినా పెడచెవిన పెడుతుందని, విధిలేని పరిస్థితిలో మహాధర్నా కార్యక్రమాన్ని చేపట్టాల్సి వస్తోందని అన్నారు. ఈ నెల 17న హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద పెన్షనర్ల మహాధర్నా నిర్వహించనున్నట్లు అనంతరం మహాధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ రూపొందించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకెశాల ప్రభాకర్‌రావు, కోశాధికారి కనపర్తి దివాకర్, సిరిసిల్ల జిల్లా ఉపాధ్యక్షుడు వంగ సుధాకర్, పాలోజు రవీందర్ పాల్గొన్నారు.

పరమ పవిత్రం కార్తీక దీపం


ధర్మపురి గోదావరి నది వద్ద హారతి ఇస్తున్న అర్చకులు, మహిళలు

ధర్మపురి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కార్తీక దీపం పరమ పవిత్రమని ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ అన్నారు. కార్తీక మాసం పురస్కరించుకుని ధర్మపురి వద్ద గోదావరి హారతి 22వ రోజు బుధవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్‌శర్మ భక్తులను ఉద్దేశించి ధార్మిక ప్రసంగం చేశారు. కార్తీక మాసంలో నెల రోజుల పాటు దీపాలు వెలిగించడం ఎంతో శ్రేష్టమని అన్నారు. అనంతరం రాత్రి వరకు నదీ మాతకు హారతి ఇచ్చారు. మహిళలు డొప్పలో దీపాలు వెలిగించి గోదావరి నదిలో వదిలారు. ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్ ఉన్నారు.

జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక


అక్షిత్‌రెడ్డి, సిద్దు

సిరిసిల్ల టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఎస్‌జీఎఫ్ బాలుర జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు జిల్లా కేంద్రంలోని వాలీబాల్ అకాడమీకి చెందిన విద్యార్థులు అక్షిత్‌రెడ్డి, సిద్దు ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయి అండర్-19 విభాగం వాలీబాల్ పోటీల్లో సిరిసిల్ల వాలీబాల్ అకాడమికి చెందిన అక్షిత్‌రెడ్డి, సిద్దు తమ క్రీడా ప్రతిభతో జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. బుధవారం సిరిసిల్లలో వీరిని జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు చెన్నమనేని శ్రీకుమార్, ప్రధానకార్యదర్శి అజ్మీరా రాందాస్, ఉపాధ్యక్షుడు చింతకింది శ్యాంకుమార్, కోశాధికారి కోడం శ్రీనివాస్, గుడ్ల రవి, అకాడమి శిక్షకులు సంపత్, జగన్ అభినందించారు.

రాష్ట్రస్థాయి రన్నింగ్ పోటీలకు ఎంపిక


రామంచ సహస్ర

ముత్తారం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హరిపురం గ్రామానికి చెందిన రామంచ సహస్ర రాష్ట్రస్థాయి రన్నింగ్ పోటీలకు ఎంపికైంది. రాజేశం-వాణి దంపతుల కుమార్తె సహస్ర రామగుండంలోని గురుకుల పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నది. అండర్ 14 పోటీల్లో జిల్లాస్థాయి 400మీటర్ల రన్నింగ్ పోటీల్లో 2వ స్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. సహస్రను ఉపాధ్యాయబృందం, తల్లితండ్రులు అభినందించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


పోటీలకు ఎంపికైన తాటిపల్లి గురుకుల, బాలికల పాఠశాల విద్యార్థులు

మల్యాల, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మల్యాలలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినిలు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం నీరజ, పీడీ అంజయ్య తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయిలో జరిగిన పోటీలలో లాస్య, చంద్రకళ అనే విద్యార్థినీలు మూడువేల మీటర్ల రేస్, డిస్కస్‌త్రోలో సిల్వర్, బంగారు పతకాలు సాధించినట్లు పేర్కొన్నారు. అలాగే నూకపల్లిలో గల ప్రతిభ స్కూల్‌కు చెందిన హనుమాన్ అనే విద్యార్థి 600మీటర్ల రేస్‌లో వెండి పతకం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక అయ్యారని కరస్పాండెంట్ అమీర్ తెలిపారు. ఈ నెల 14 నుంచి నాలుగు రోజుల పాటు రంగారెడ్డి జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. మండలంలోని తాటిపల్లి బాలికల గురుకుల పాఠశాలకు చెందిన జరాఫతీమా, మనీషా అనే విద్యార్థినిలు కరీంనగర్‌లో ఉమ్మడి జిల్లా స్థాయి అథ్లెటిక్స్‌లో పాల్గొనున్నారు.


బాలికల పాఠశాల విద్యార్థులు

ప్రచార రథం వద్ద రాజన్న దర్శనం


పనులు పర్యవేక్షిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్


కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

వేములవాడ టౌన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా రాజరాజేశ్వరస్వామి దేవాలయానికి వచ్చిన భక్తులు బుధవారం స్వామివారి దర్శనాలు నిలిపివేయడంతో తూర్పుద్వారం ఎదురుగా ప్రచార రథం వద్ద ఏర్పరిచిన ఎల్ఈడీ ద్వారా భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులకు ఆలయ ఇవో రమాదేవి పలు సూచనలు చేశారు. ఇందుకోసం ప్రత్యేకంగా క్యూలైన్ ఏర్పాటుచేశారు. క్యూలైన్ ద్వారా భక్తులు ప్రచార రథం వద్దకు చేరుకొని దర్శించుకున్నారు. భీమేశ్వరాలయం వద్ద బుధవారం రాత్రి కార్తీక దీపోత్సవం నిర్వహించారు. అనంతరం భీమేశ్వరస్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించారు. సాముహిక దీపాలంకరణకు హాజరైన సుహాసీనులకు వాయినాన్ని ఏఈవో శ్రీనివాస్ అందజేశారు. కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకులు శ్రీనివాస్ శర్మ, జూనియర్ అసిస్టెంట్ కూరగాయల శ్రీనివాస్, నరాల రాజులు పాల్గొన్నారు.

● పనులు పర్యవేక్షించిన ప్రభుత్వ విప్

రాజరాజేశ్వరస్వామి దేవస్థానంలో కొనసాగుతున్న ఆలయ విస్తరణ పనులను బుధవారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పర్యవేక్షించారు. భవనాల కూల్చివేత, శిథిలాల తొలగింపు తదితర పనులను పరిశీలించారు. శిథిలాల తొలగింపు వేగవంతంగా పూర్తిచేయాలని ఆదేశించారు. ప్రచార రథం వద్ద ఎల్ఈడీలో స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని సూచించారు. ఆర్డీవో రాధాబాయి, ఈవో రమాదేవి, ఏఎస్పీ చంద్రయ్య, ఈఈ రాజేష్, డీఈ రఘునందన్, ఆర్అండ్‌బీ డీఈ అచ్చయ్య ఉన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


రిశ్విత

ఇల్లంతకుంట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వల్లంపట్ల గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి మామిండ్ల రిశ్విత రాష్ట్రస్థాయి హామర్‌త్రో పోటీలకు ఎంపికయింది. కరీంనగర్‌లో జరిగిన ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలలో అండర్ 17 విభాగంలో రిశ్విత ఉత్తమ ప్రదర్శన కనబర్చింది. ఈ నెల 15నుంచి హైద్రాబాద్‌లోని జింఖానా స్టేడియంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొననుంది. విద్యార్థి ఎంపిక కావడంపై ప్రధానోపాధ్యాయుడు దూస రఘుపతి, వ్యాయామ ఉపాధ్యాయుడు సాబీర్‌లతో పాటు గ్రామస్థులు అభినందనలు తెలిపారు.

కోతుల దాడిలో వృద్ధురాలికి గాయాలు

మల్యాల, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కోతుల దాడిలో మల్యాల మండల కేంద్రంకు చెందిన రాచర్ల చిన్నమ్మ అనే వృద్ధురాలి కాలుకు తీవ్రగాయాలు అయ్యాయి. చికిత్స కోసం మల్యాల ప్రభుత్వ ప్రాథమిక ఆసుపత్రి తీసుకెళ్లగా గాయాలు తీవ్రంగా ఉండడంతో ప్రథమ చికిత్స అనంతరం జగిత్యాల ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లారు. అయితే మండలంలో ఇటీవల కోతుల బెడద అధికమవగా జనాలపై దాడులు చేస్తూ గాయపరుస్తున్నాయని పూర్తి స్థాయిలో వైద్యంకు సంబంధించి వ్యాక్సిన్ ఇతరాత్రా ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో అందుబాటులో ఉంచాలని మాజీ ఎంపీటీసీ రమేశ్ వైద్యాధికారులను కోరారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అప్పగింత

కరీంనగర్ క్రైం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ త్రీటౌన్ పరిధిలో పోగొట్టుకున్న 20 సెల్‌ఫోన్‌లను బుధవారం టౌన్ ఏసీపీ వెంకటస్వామి యజమానులకు అప్పగించారు. ఆయా సందర్భాల్లో బాధితులు పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లను సీఐ జాన్‌రెడ్డి ఆధ్వర్యంలో సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఫోన్‌లను రికవరీ చేసిన సిబ్బందిని ఏసీపీ అభినందించారు.

బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత


రికార్డులను పరిశీలిస్తున్న రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ మెంబర్ చందన

చందుర్తి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): బాలల హక్కులు పరిరక్షించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ మెంబర్ మర్రిపల్లి చందన అన్నారు. చందుర్తి మండలం మరిగడ్డ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం, సనుగుల గ్రామంలోని గంగిరెద్దుల కాలనీని సందర్శించారు. బాలల హక్కులపై అవగాహన కల్పించారు. బాలల హక్కుల పరిరక్షణలో అధికారులంతా భాగస్వాములు కావాలన్నారు. బాలల హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరు అంకితభావంతో పని చేయాలన్నారు. బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలని, ఆడపిల్లకు 18 ఏళ్లు, మగ పిల్లాడికి 21 ఏళ్లు నిండిన తర్వాతే పెళ్లిళ్లు చేయాలని సూచించారు. బాల్య వివాహాలు చేయడంతో ఆరోగ్య సమస్యలు తలెత్తడంతో పాటు గృహహింస పెరిగే అవకాశాలు ఉంటాయన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని సూచించారు. అలాగే 14 ఏళ్లలోపు చిన్నారులను పాఠశాలలకు పంపించాలని చెప్పారు. మధ్యలో చదువు మానిన విద్యార్థులను గుర్తిస్తే వెంటనే పాఠశాలలో చేర్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి వినోద్, ఐసిడిఎస్ సిడిపిఓ సుచరిత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శంకరమ్మ, డిస్టిక్ ప్రొటెక్షన్ ఆఫీసర్ కవిత, డిసిపిఓ అంజి పాల్గొన్నారు.

గణితంలో రేపాక విద్యార్థిని ఉత్తమ ప్రతిభ


వర్షిణి

ఇల్లంతకుంట, నవంబరు 12(ఆంధ్రజ్యోతి) : మండలంలోని రేపాక గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని బొడ్డు వర్షిణి గణితంలో ఉత్తమ ప్రతిభ కనబర్చింది. సదిశ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మ్యాథమెటిక్స్ టాలెంట్ పోటీలలో రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రలకు చెందిన విద్యార్థులు పాల్గొన్న పోటీలలో తృతీయస్థానంలో నిలిచింది. ఉన్నత విద్యకోసం కార్పోరేట్ కళాశాలలు హాస్టల్‌తో పాటు ఉచితంగా విద్యను అందించడానికి ముందకు వచ్చినట్లు విద్యార్థిని తండ్రి రాజు తెలిపారు. ఈసందర్భంగా వర్షిణీకి మండల విద్యాధికారి చెప్యాల శ్రీనివాస్‌గౌడ్, ప్రధానోపాధ్యాయురాలు రేవతి, గణిత ఉపాధ్యాయుడు మల్లికార్జున్, పాఠశాల కమిటీ చైర్మన్ లీలలతో పాటు ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందనలు తెలిపారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

ఇల్లందకుంట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఇల్లందకుంట మండలంలో పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై క్రాంతికుమార్ తెలిపారు. మండలంలోని చిన్నకోమటిపల్లి శివారులో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో దాడులు నిర్వహించినట్లు, వారి వద్ద రూ.18,300 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఆరుగురిపై కేసు నమోదు చేశామన్నారు.

'చేయూత' ఏదీ?

(5వ పేజీ తరువాయి)

భాగంగా చేయూత పథకం కింద దివ్యాంగుల పింఛన్లను 3,016 నుంచి 6వేల రూపాయలు, ఇతర పింఛన్‌లను 2,016రూపాయల నుంచి 3 వేల రూపాయలకు పెంచుతామని ప్రకటించారు. కానీ అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావస్తున్నా, ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ప్రభుత్వం పింఛన్ల ఊసెత్తడం లేదు. అధికారంలోకి వచ్చిన తర్వాత 2023 డిసెంబర్‌26నుంచి జనవరి 8వతేదీ వరకు గ్రామ, పట్టణ సభలు నిర్వహించి ఐదు గ్యారెంటీ పథకాలకు దరఖాస్తులను స్వీకరించిన విషయం తెలిసిందే. అందులో భాగంగా చేయూత పథకం కింద దివ్యాంగుల కోసం 6,979దరఖాస్తులు రాగా, ఇతరులు 49,552 మంది, మొత్తం 56,531దరఖాస్తులు వచ్చాయి. కానీ రెండేళ్ల ప్రభుత్వం ఇప్పటివరకు ఒక్క కొత్తపింఛన్ కూడా మంజూరు చేయలేదు. కేవలం మరణించే పింఛన్ దారుల స్థానంలో ఆ కుటుంబానికి చెందిన అర్హులైన వారికి మాత్రమే కొత్తవి మంజూరు చేస్తున్నారు. కానీ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు ఇప్పటివరకు కొత్తవారికి ఒకరికి కూడా పింఛను మంజూరు చేయలేదని తెలుస్తున్నది. అంతేకాకుండా ప్రభుత్వం ప్రస్తుతం కొనసాగిస్తున్న పింఛన్లను పెంచుతుందని లబ్ధిదారులు ఆశగా ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం ఎక్కడ కూడా చేయూత పింఛన్ల గురించి ఊసెత్తక పోవడంతో అసలు కొత్తపింఛన్లు మంజూరు చేస్తుందా, లేదా అనే అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. అలాగే ఉన్న పింఛన్లను కూడా పెంచే పరిస్థితి లేదని తెలుస్తున్నది. కనీసం భర్త చనిపోయి వితంతువులు అయిన వారిని ఆదుకునేందుకు కూడా ప్రభుత్వం కొత్త పింఛన్లను మంజూరు చేయక పోవడంతో వారు చేయూత లేక తీవ్రఇబ్బందులు పడుతున్నారు. ప్రజాపాలన గ్రామ పట్టణ సభల సందర్భంగా స్వీకరించిన దరఖాస్తులను ఇప్పటివరకు పరిశీలించిన దాఖలాలు అసలే కనబడడం లేదు. కేవలం ఆన్‌లైన్ మాత్రమే వాటిని నమోదు చేసి ఉంచారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి కొత్త పింఛన్లు మంజూరు చేయాలని దరఖాస్తుదారులు కోరుతున్నారు.

సీడీపీవో ఆఫీసులో ఉద్యోగుల ఇష్టారాజ్యం

- సమయపాలన పాటించరు.. విధులపై అలసత్వం
- టూర్ల పేరిట సాకులు, సెంటర్లపై పర్యవేక్షణ కరువు
- 11.40 దాటినా కార్యాలయంలో ఖాళీగా దర్శనమిచ్చిన కుర్చీలు

మంథని, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మంథని ఐసీడీఎస్ సీడీపీవో కార్యాలయంలో ఉద్యోగులు ఇష్టారాజ్యంగా వ్యవరిస్తున్నారు. ఇన్‌చార్జి సీడీపీవో, సూపర్ వైజర్లు, ఇతరఉద్యోగులు ఎవరూ కార్యాలయంలో సమయపాలన పాటించడంలేదు. బుధవారం ఉదయం 11.40నిమిషాలు దాటినా ఉద్యోగులు ఎవరూ ఆఫీసులో విధులు నిర్వహించడానికి రాలేదు. ఉద్యోగులు ఎవరూ లేక కార్యాల యంలోని అన్నివిభాగాల్లో ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. ఈసమయంలో ఆఫీసులో ఒక స్వీపర్ తప్పా ఎవరూ లేరు. 11.45నిమిషాలకు ఒక సూపర్ వైజర్ కార్యాలయానికి వచ్చారు. నిత్యం ఉద్యోగులు ఇలానే తమ ఇష్టారాజ్యంగా కార్యాలయానికి వచ్చి పోతున్నారు. ఆఫీసు సమయపాలన, విధుల నిర్వహణ పట్ల వారు నిర్లక్ష్యంగా వ్యహరిస్తున్నారు. మరికొందరు సూపర్‌వైజర్లు టూర్ల పేరిట ఇటు కార్యాలయానికి రావడం లేదని, ఆటు సెంటర్ల విజిట్‌లకు వెళ్లడం లేదని ఆరోపణలు ఉన్నాయి. కొందరు ఉద్యోగులు వ్యక్తిగత పనులపై వెళ్లి తొలుత లీవ్ తీసుకొని ఆ తర్వాత మరునాడు వచ్చి అటెండెన్స్ రిజిస్టర్‌లో సంతకాలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇక్కడ పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్‌ను మరోప్రాంతానికి డిప్యూటేషన్ పంపిణీ, ఎక్కడో పనిచేస్తున్న మరోజూనియర్ అసిస్టెంట్‌ను ఇక్కడి డిప్యూటేషన్‌పై బదిలీచేశారు. సీడీపీవో సైతం ఇన్‌చార్జిగా ఉండటంతో కార్యాలయంపై సరైన పర్యవేక్షణ లేక సూపర్‌వైజర్లు, ఉద్యోగులు సమయపాలన పాటించకుండా, విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తున్నారు. మంథని సీడీపీవో కార్యాలయంపై సంబంధితశాఖ, జిల్లా ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేని కారణంగా కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులు, సూపర్‌వైజర్లు తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఆఫీసు పరిస్థితితే ఇంతదారుణంగా ఉంటే ఇంకా అంగన్‌వాడీ సెంటర్ల నిర్వాహణ, పర్యవేక్షణ ఎంతదారుణంగా ఉందో చెప్పాల్సిన అవసరంలేదు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు మంథని సీడీపీవో కార్యాలయంపై ప్రత్యేక దృష్టి సారించి విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యహరించే వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. ఈవిషయంపై ఇన్‌చార్జి సీడీపీవో పుష్పలతను వివరణ కోరేందుకు 'ఆంధ్రజ్యోతి' పలుమార్లు ఫోన్ చేయగా ఆమె స్పందించలేదు.



ఆఫీసులో ఉద్యోగులు లేక ఖాళీగా ఉన్న కుర్చీలు

అందెశ్రీ మృతి కళారంగానికి తీరని లోటు

కాల్వశ్రీరాంపూర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): అందెశ్రీ మృతి కళారంగానికి తీరని లోటని కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు అంబాల రాజేందర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో కళాకారుల సంఘం జిల్లాఅధ్యక్షుడు అంబాల రాజేందర్ ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తా వద్ద అందెశ్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమాన్ని బలోపేతం చేయడానికి సాహితీవేత్తగా అందెశ్రీ చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు.కార్యక్రమంలో కళాకారులు సొన్నాయిటెంకం చంద్రమౌళి, ఎండీ రజాక్, పాలశంకర్, బర్ల తిరుపతి, పాల రాములు, సింగరవేని సదానందం, బ్రహ్మన్న, మంథని లక్ష్మయ్య, ఉప్పుల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ: తెలంగాణచౌరస్తాలో బుధవారం అందెశ్రీ చిత్రపటానికి కాంగ్రెస్‌నాయకులు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన ఆత్మ శాంతి చేకూరాలని మౌనం పాటించారు. ఆయన గొంతుక తెలంగాణ ఆవిర్భావానికి బాటలు వేసినట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు గుండేటి రాజేష్, జిల్లాఉపాధ్యక్షుడు మారెల్లిరాజిరెడ్డి, సాగంటి శంకర్, చక్రపాణి, సదానందం, రాములు, తిరుపతిరెడ్డి, కేశవులు, సారయ్యనాయక్, ప్రశాంత్, రాజేశం, రాకేష్, సంపత్, అజయ్ పాల్గొన్నారు.



అందెశ్రీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కళాకారులు

ప్రాచీన యోగ దినచర్యపై అవగాహన

యైటింక్లయిన్‌కాలనీ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మిషన్ హెల్దీ సింగరేణి కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆర్జీ-2 జీఎం కార్యాలయంలో ప్రాచీన యోగ దినచర్య అనే అంశంపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా జీఎం బండి వెంకటయ్య మాట్లాడారు. ప్రాచీనకాలంలో ప్రజలు తమ రోజువారి దినచర్యగా యోగసాధన చేసేవారని, ప్రస్తుత ప్రజలతో పోల్చితే పూర్వకాలం వాసులు ఆరోగ్యంగా ఉండేవారని అన్నారు. ప్రతి ఉద్యోగి యోగాను నిత్యజీవితంలో భాగం చేసుకోవాలన్నారు. ఈసందర్భంగా యోగ గురువు షణ్ముఖ శివచంద్ర యోగా ప్రాముఖ్యతను గురించి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచి సెక్రెటరీ జిగురు రవీందర్, ఎస్వోటూ జీఎం రాముడు, అధికార ప్రతినిధి అరవిందరావు, సేవా అధ్యక్షురాలు బండి వనజ వెంకటయ్య, వివిధ విభాగాల అధికారులు, జీఎం కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రామగుండం కార్పొరేషన్‌కు ట్రాక్టర్ బహూకరణ

కోల్‌సిటీ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ క్రింద రామగుండం నగర పాలకసంస్థకు రూ.9.4లక్షల విలవచేసే ట్రాక్టర్‌ను బుధవారం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డీజీఎం అపర్ణరెడ్డి మున్సిపల్ కార్పొషన్ అడిషనల్ కమిషనర్ మారుతి ప్రసాద్‌కు అందజేశారు. నగర పాలక సంస్థ కమిషనర్ అరుణశ్రీ వినతి మేరకు యూనియన్ బ్యాంకు ఈ ట్రాక్టర్‌ను అందజేశారు. కార్యక్రమంలో పెద్దపల్లి లీడ్‌డిస్ట్రిక్ట్ మేనేజర్ వెంకటేష్ పాల్గొన్నారు.

ఉగ్రవాదుల దిష్టిబొమ్మ దహనం

మార్కండేయకాలనీ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ బుధవారం రాత్రి జనసేనపార్టీ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఉగ్రవాదులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.



ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేస్తున్న జనసేన నాయకులు

మల్లికార్జున స్వామికి భక్తుల పూజలు

ఓదెల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): శైవక్షేత్రమైనా భ్రమరాంభ మల్లికార్జునస్వామి ఆలయంలో బుధవారం భక్తులు పూజలు నిర్వహించారు. ఆలయంలో ప్రదక్షణలు నిర్వ హించి కోడెమొక్కులు సమర్పించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఒగ్గుపూజా రులతో పట్నాలు వేయించి మల్లన్నకు సమర్పించారు.

బీసీ రిజర్వేషన్ల పోరాటం ఉధృతం చేస్తాం

పెద్దపల్లిటౌన్/కల్చరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): బీసీల 72శాతం రిజర్వేషన్ల సాధన లక్ష్యంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కందుల సదాశివ్ పేర్కొన్నారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో జిల్లా, మండల స్థాయిలకు నూతన కార్యవర్గ నియామక సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా జిల్లాకార్యవర్గానికి, పలు మండలాలకు నూతన నాయకులను నియమించారు. జిల్లాఉపాధ్యక్షుడిగా గుర్రాల వీరేశం, జిల్లా సహాయ కార్యద ర్శులుగా వంగరవీందర్, కొమ్ము కరుణాకర్, దండే వెంకటేశ్వర్లు, జిల్లా యూత్ ప్రధానకార్యదర్శి చర్లపల్లి రాజుగౌడ్, ధర్మారం మండల ప్రధానకార్యదర్శి మూల మల్లేశంగౌడ్, ఓదెల మండలప్రధానకార్యదర్శి రాపోలు హనుమంతరావును నియమించారు. సమావేశానికి రాష్ట్ర ప్రధానకార్యదర్శి చర్లపల్లి సురేష్‌గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై నూతనంగా నియమితులైన నాయకులకు నియామక పత్రాలను అందజేశారు. అనంతరం మాట్లాడుతూ రిజర్వేషన్ల డిమాండ్ సాధనలో భాగంగా నవంబర్13న పెద్దపల్లి జిల్లాకేంద్రంలోని బస్టాండ్ తలపెట్టిన ధర్నా కార్యక్రమానికి బీసీ నాయకులు, కార్యకర్తలంతా పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లాలోని వివిధమండలాలకు చెందిన బీసీ సంక్షేసంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బీసీ సంఘం నాయకులు

సివిల్స్ ఇంటర్వ్యూలకు ఎంపికైన 43మంది

గోదావరిఖని, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన రాజీవ్‌గాంధీ సివిల్స్ అభయ హస్తం పథకం రెండో ఏడాది మంచి ఫలితాలను సాధించింది. ఈ పథకం నుంచి ప్రోత్సాహకాన్ని అందుకున్న మొత్తం 202మందిలో, 43మంది మెయిన్స్ పాసై ఫైనల్ ఇంటర్వ్యూలకు ఎంపికయ్యారు. ఈ పథకంలో భాగంగా ప్రిలిమ్స్‌లో పాసైన 202మంది సివిల్స్ అభ్యర్థులకు మెయిన్స్‌లో పాల్గొనడానికి ప్రోత్సాహకంగా సింగరేణి యాజమాన్యం సీఎస్ఆర్ నిధుల నుంచి ఒక్కొక్కరికి లక్ష రూపాయల చొప్పున రాష్ట్ర ప్రభుత్వం నగదు ప్రోత్సాహకాన్ని అందించింది. వీరిలో 43మంది మెయిన్స్ పాసై ఫైనల్ ఇంటర్వ్యూలకు ఎంపికయ్యారు. దీనిపై సింగరేణి సీఎండీ ఎన్ బలరామ్ ఒక ప్రకటన చేస్తూ ప్రభుత్వం ప్రారంభించిన రాజీవ్‌గాంధీ సివిల్స్ అభయహస్తం పథకానికి సింగరేణి సంస్థ తన సామాజిక బాధ్యతగా ఆర్థికసహకారం అందించిందన్నారు. ఒకేసారి 43మంది ఫైనల్ ఇంటర్వ్యూకి ఎంపిక కావడం ఎంతో సంతోషకరంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఫైనల్స్‌లో కూడా విజేతలై రాష్ట్రానికి మంచిపేరు తేవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క తమ సందేశాలలో పేర్కొన్నారు.



అభ్యర్థులను అభినందిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



ఆర్జీ-2లో సైబర్ నేరాలపై అవగాహన

యైటింక్లయిన్‌కాలనీ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): సైబర్‌జాగృతి బార్‌లోభాగంగా బుధవారం ఆర్జీ-2 ఏరియాలో ఉద్యోగులకు సైబర్‌నేరాలపై ఐటీ విభాగం అధికారులు అవగాహన కల్పించారు. జీఎం ఆఫీస్‌లో జరిగిన ఈకార్యక్రమంలో జీఎం బండి వెంకటయ్య మాట్లాడారు. సింగరేణి ఉద్యోగులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సింగరేణి డీజీఎం(ఐటీ) శ్రీనివాసరావు, నానాఫడ్నవీస్, మేనేజర్(ఐటీ)లు సైబర్‌నేరాల తీరుతెన్నులు, వాటి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఉద్యోగులకు సైబర్ సెక్యూరిటీ అంశంపై క్విజ్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకుడు ప్రకాష్, ఎస్వోటూ జీఎం రాముడు, పర్సనల్ డీజీఎం అరవిందరావు, అధికారులు పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీతోనే కార్మికుల సమస్యల పరిష్కారం

- ఆర్జీ-3 ఉపాధ్యక్షుడు కోట రవీందర్‌రెడ్డి

రామగిరి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఐఎన్‌టీయుసీతో కార్మికుల సమస్యలు పరిష్కారం అవుతున్నాయని ఆర్జీ-3 ఉపాధ్యక్షుడు కోటరవీందర్ రెడ్డి అన్నారు. బుధవారం సెంటినరీకాలనీ ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికుల సమస్యల పరిష్కారంలో చిత్తశుద్ధితో వ్యవహరిస్తున్నట్లు తెలిపారు. కొన్ని యూనియన్లు పనిచేయకుండా ధర్నాలు, ఆందోళన పేరున కార్మికులను మోసంచేసే ప్రయత్నం చేస్తున్నట్లు ఆరోపించారు. సమావేశంలో నాయకులు ఎల్లంకి రామారావు, జక్కులదామోదర్, నరేంద్ల శ్రీనివాస్, సాయికృష్ణ, కొమురయ్య, మేకలమారుతీ, ప్రేమ్‌కుమార్,పాండు తదితరులుపాల్గొన్నారు.

టీబీజీకేఎస్ పిట్ కమిటీ పరిచయ కార్యక్రమం

యైటింక్లయిన్‌కాలనీ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఓసీపీ-3 ఎస్అండ్‌డీ సెక్షన్ హెచ్‌వోడీగా బాధ్యతలు స్వీకరించిన నాగేశ్వరరావుకు టీబీజీకేఎస్ పిట్‌కమిటీ పరిచయ కార్యక్రమం బుధవారం జరిగింది. బాధ్యతలు స్వీకరించిన నాగేశ్వర్‌రావుని పిట్‌కమిటీ సన్మానించింది. అనంతరం ఆర్జీ-2 వైస్‌ప్రెసిడెంట్ అయిలి శ్రీనివాస్ పిట్‌కమిటీ సభ్యులను హెచ్‌వోడీకి పరిచయం చేశారు. సెక్షన్‌లో ఉన్న సమస్యలను వివరించారు. కార్మికుల సమస్యలు పరిష్కరిస్తే ఉత్సాహంతో పనిచేసే అవకాశం ఉంటుందని, సంస్థ అభివృద్ధికి టీబీజీకేఎస్ సహకరిస్తుందని, అదేవిధంగా సమస్యల పరిష్కారం పట్ల అధికారులు శ్రద్ధచూపాలని అయిలి శ్రీనివాస్‌కోరారు. కార్యక్ర మంలో ప్రభాకర్‌రెడ్డి, రమేష్, దాసరి శ్రీనివాస్, లింగారెడ్డి, రాకేష్, సదయ్య, కొంరయ్య, కుమార్, సురేష్, అశోక్, సంజీవ్, ఖాదర్, చంద్రశేఖర్‌రావు, కరుణాకర్‌రెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.



హెచ్‌వోడీకి సమస్యలు వివరిస్తున్న టీబీజీకేఎస్ నాయకులు

నిత్యం యోగాతో ఆరోగ్యం

- ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు



యోగా చేస్తున్న జీఎంలు, అధికారులు

రామగిరి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): నిత్యం యోగ సాధనతోనే ఆరోగ్యం జీవనం కొనసాగించవచ్చునని ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు అన్నారు. బుధవారం ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని సెంటినరీకాలనీలోని సిఎస్‌సివో క్లబ్‌లో మిషన్‌హెల్తీ సింగరేణి అనే కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్ ప్రాచీన యోగా దినచర్య యోగా గురువు షణ్ముక శివచంద్రచే నిర్వహించిన యోగాకార్యక్రమానికి జీఎంలు సుధాకర్ రావు, నాగేశ్వర్‌రావులు ముఖ్యఅతిథులుగా హజరైయ్యారు. ప్రతి ఒక్కరు యోగాతో ఆరోగ్యం ఉండవచ్చునని మన ప్రాచీన కాలంలోనే వెల్లడించారని జీఎంలు పేర్కోన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామచంద్రరెడ్డి, శ్రీనివాస్‌రావు, అధికారులు శేఖరబాబు, యాదయ్య, రామ్మోహన్, బండి సత్యనారాయణ, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

ధర్మారంలో మాజీమంత్రి పర్యటన



గొల్ల కుర్మల కుటుంబాలను పరామర్శిస్తున్న కొప్పుల

ధర్మారం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్ బుధవారం ధర్మారం మండలంలో పర్యటించారు. మండలంలోని కమ్మరిఖాన్‌పేట గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మరణించిన పబ్బతి మునెమ్మ, మెంగని రాయమల్లు అనారోగ్యంతో మరణించగా వారి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. వారి కుటుంబాలను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఇటీవల పెరుకపల్లిలో విషాహారం తిని 60గొర్రెలు మరణించగా గొల్ల కుర్మల కుటుంబాలను కొప్పుల పరామర్శించారు. అనంతరం మండల,జిల్లా పశువైద్యాధికారులతో ఫోన్‌లో మాట్లాడి కుటుంబాలను ఆదుకోవాలని సూచించారు. ఆయనవెంట ముత్యాల బలరాంరెడ్డి, రాసూరి శ్రీధర్, గుర్రం మోహన్ రెడ్డి, పూస్కూరి రామారావు, కోమటిరెడ్డి మల్లారెడ్డి, కూరపాటి శ్రీనివాస్, సత్తనవేని సదయ్య, అజ్మీర మల్లేశం, కాంపెల్లి చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయులను పర్యవేక్షణ అధికారులుగా నియమించడం సరికాదు

- డీటీఎఫ్ రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు రఘుశంకర్ రెడ్డి



మాట్లాడుతున్న రఘుశంకర్ రెడ్డి

పెద్దపల్లి కల్చరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు ఉపాధ్యాయులనే పర్యవేక్షణ అధికారులుగా నియమించడం సరైంది కాదని డీటీఎఫ్ రాష్ట్ర పూర్వఅధ్యక్షుడు ముసుకుల రఘుశంకర్‌రెడ్డి అన్నారు. పెద్దపల్లిలో జరిగిన డీటీఎఫ్ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే ఖాళీగా ఉన్న పర్యవేక్షక అధికారులను డీఈవో, డిప్యూటీ డీఈవో, ఎంఈవో పోస్టులను పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలన్నారు. రాష్ట్రకార్యదర్శి శ్యామ్ మాట్లాడుతూ జిల్లాలో ప్రైమరీ పాఠశాలల్లో ఎస్జీటీల కొరత ఉందని, దీనిని జిల్లాకలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. సమావేశంలో మల్క రాంకిషన్‌రావు, జిల్లా ప్రధానకార్యదర్శి అప్పిడి సంతోష్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు శంషోద్దీన్, కిరణ్, జిల్లా కార్యదర్శులు రాజు, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌కు మంత్రి శ్రీధర్‌బాబు పరామర్శ

మంథని, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మంథని మేజర్ గ్రామపంచాయతీ మాజీసర్పంచ్ వొడ్నాల శ్రీనివాస్ తండ్రి వొడ్నాల చిన్నమల్లయ్య అనారోగ్యంతో ఇటీవల మృతిచెందగా రాష్ట్ర ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు శ్రీనివాస్ కుటుంబాన్ని బుధవారం పరామర్శించారు. దశదిన కర్మలో పాల్గొన్న మంత్రి శ్రీధర్‌బాబు స్వర్గీయ చిన్నమల్లయ్య మృతిపట్ల విచారం వ్యక్తంచేసి చిత్రపటం వద్ద పూలువేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు తన సానుభూతి ప్రకటించారు. ఆయన వెంట ఏఎంసీ, పీఏసీఎస్ చైర్మన్లు కుడుదల వెంకన్న, కొత్త శ్రీనివాస్, కాంగ్రెస్ నేతలు శశిభూషణ్‌కాచే, ఐలి ప్రసాద్, సెగ్గెం రాజేష్, లింగయ్య యాదవ్, పెంటరి రాజు, పోలు శివ, రాజేందర్ ఉన్నారు.

ప్రారంభోత్సవానికి సిద్ధమైన ఐబీ కాంప్లెక్స్ గదులు

సుల్తానాబాద్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ పట్టణంలోని ఐబీకాంప్లెక్స్ గదుల నిర్మాణం పూర్తై ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్నాయి. వీటి ముందు ఉన్న పాతగదులను ఇటీవల కూల్చివేశారు. రెండు మూడురోజుల్లో నూతన గదలను ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు.

గుండెపోటుతో కాంగ్రెస్ నాయకుడు మృతి

ముత్తారం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామకృష్ణాపూర్ గ్రామానికి చెందిన యువజన కాంగ్రెస్ నాయకుడు మర్రిపెల్లి రాజ్‌కుమార్(32) మంగళవారం గుండెపోటుతో మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్లితే.. మంథని పట్టణంలో హమాలీగా పనిచేసే రాజు ఎప్పటిలాగే పనులు చేసుకుంటున్నాడు. సాయంత్రం సిమెంట్ బస్తాలు లోడ్ దింపుతుండగా ఒక్కసారిగా కుప్పకూలి పోవడంతో గమనించిన తోటిహమాలీలు మంథని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు రాజు అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. రాజ్ కుమార్ మృతిపట్ల యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బక్కతట్ల వినీత్ సంతాపం తెలిపారు.



రాజ్ కుమార్(ఫైల్)

కులం పేరుతో దూషించి, దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

- ఖని ఏసీపీ, సీఐకి దళిత సంఘాల ఫిర్యాదు

కోల్‌సిటీటౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని విఠల్ నగర్‌కు చెందిన దళిత నాయకుడు ధర్మసమాజ్‌పార్టీ జిల్లా నాయకుడు కనకం గణేష్‌ను ఈనెల10న అకారణంగా కులంపేరుతో దూషించి, దాడిచేసి, హత్యాయత్నానికి పాల్పడిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం, బహుజన సమాజ్‌పార్టీ, ధర్మ సమాజ్‌పార్టీలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు బుధవారం గోదావరిఖని ఏసీపీ మడత రమేష్, వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డిలను కలిసి ఆ సంఘాలనాయకులు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో బొంకూరి మధు, కొంకటి లక్ష్మణ్, మైస రాజేష్, కాంపెల్లి సతీష్, ఇరుగురాళ్ల కిష్టయ్య, ఇరుకుల్ల రాజనర్సయ్య, మహేందర్, రవికుమార్, పోచన్న, కరీం, చంద్రశేఖర్, అశోక్ పాల్గొన్నారు.

ప్రభుత్వం బోనస్ ఇచ్చి రైతులను ఆదుకోవాలి

కాల్వశ్రీరాంపూర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): యాసంగి, వానకాలం వడ్లకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చినమాట ప్రకారం బోనస్ చెల్లించి రైతులను ఆదుకోవాలని మాజీజడ్పీటీసీ వంగల తిరుపతిరెడ్డి అన్నారు. బుధవారం మండలకేంద్రంలోని ధాన్యం కొనుగోలుకేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ యాసంగిలో సన్నవడ్లకు బోనస్ ఇప్పటివరకు ఇవ్వలేదని ఆరోపించారు. ప్రస్తుత వానాకాలం పంటతోపాటు యాసంగి పంట బోనస్ కూడా అందించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీఎంపీపీ నూనేటి సంపత్‌యాదవ్, మాజీజడ్పీటీసీ వంగల తిరుపతిరెడ్డి, నాయకులు నిదానపురం దేవయ్య, ఆడేపు రాజు, నాగార్జున రావు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.